JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రభాత జయభేరి

ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజిగిరి । గురువారం 05-03-2026
Medchal - Malkajgiri । Thursday 05-03-2026
Follow: jayabherinews
సంపుటి : 02 । సంచిక : 278
పేజీలు : 8 । వెల : 5
Vol. 02 । Issue 278 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com





## డ్యూరాండ్ లైన్ వద్ద భీకర పోరాటం

- 7 పాకిస్తాన్ పోస్టులను ధ్వంసం చేసిన ఆఫ్ఘన్ దళాలు

**జయభేరి, న్యూఢిల్లీ:**

నంగర్‌హార్‌ఖైబర్ తోర్ఖం సరిహద్దుపై ఆఫ్ఘన్ సైన్యం తన పట్టును బలోపేతం చేసుకుంది. మంగళవారం (మార్చి 03) తెల్లవారుజామున డ్యూరాండ్ లైన్ దాటి ఏడు పాకిస్తాన్ ఆర్మీ పోస్టులను ధ్వంసం చేసింది . అక్కడ ఉన్న సైనికులు ప్రాణాలు కోల్పోయారు. బుధవారం ఆఫ్ఘన్ సైన్యం 205వ అల్ బదర్ కార్ప్స్ ప్రత్యేక బలగాలను తోర్ఖం సరిహద్దుకు పంపింది. ఒకవైపు ఈ దళాలు తోర్ఖం సరిహద్దు సమీపంలోని కొండపై ఉన్న పాకిస్తానీ పోస్టులను ధ్వంసం చేస్తుండగా, మరోవైపు, పాకిస్తాన్‌ఆఫ్ఘనిస్తాన్ తోర్ఖం సరిహద్దు ద్వారం

...మిగతాది 2 లో



## ఐపీఎస్‌ల సంఖ్యను 105కు పెంచండి

- కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి
- మావోయిస్టుల అంశం పై సుదీర్ఘ చర్చ
- వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులు ఇవ్వండి
- తెలంగాణ పోలీసింగ్‌లో గణనీయమైన మార్పులు


**జయభేరి, న్యూఢిల్లీ:**

తెలంగాణ రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా ఐపీఎస్ అధికారుల సంఖ్యను కేటాయించాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి కేంద్ర హోం శాఖ మంత్రితో భేటీ అయ్యారు. రాష్ట్ర విభజన తర్వాత 2016లో మొదటి క్యాడర్ రివ్యూ జరిగిందని, 2021లో జరగాల్సిన క్యాడర్ రివ్యూ చాలా ఆలస్యంగా 2025లో జరిగిందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గుర్తుచేశారు. ఆ సమయంలోనూ కేవలం ఏడుగురు IPS అధికారులను మాత్రమే తెలంగాణకు కేటాయించారని తెలిపారు. దేశంతో పాటు తెలంగాణ రాష్ట్రం సైబర్ నేరాలు, డ్రగ్స్, వైట్ కాలర్ నేరాలు

...మిగతాది 2 లో

### లిక్కర్ స్కాంలో రూ.3,500 కోట్లు కాదు

## అంతకు మించి




- 175 నియోజకవర్గాల్లో పారిశ్రామిక పార్కులు
- విశాఖలో పెట్టుబడులు రూ.13.25 లక్షల కోట్లు.. సీఎం చంద్రబాబు

**విజయవాడ, మార్చి 4 :**

ఎక్సైజ్ శాఖలో గత ప్రభుత్వ హయాంలో భారీ అవినీతి జరిగిందని సీఎం చంద్రబాబు ఆరోపించారు. ఏపీ లిక్కర్ స్కామ్ దేశంలోనే అతిపెద్ద మద్యం కుంభకోణాల్లో ఒకటిగా నిలిచిందని పేర్కొన్నారు. మొదట ఈ కుంభకోణం విలువ సుమారు రూ.3,500 కోట్లుగా అంచనా వేశారని, కానీ తాజా వివరాల ప్రకారం అది రూ.10,000 కోట్ల వరకు ఉండే అవకాశం ఉందని సీఎం వెల్లడించారు. ఈ వ్యవహారంలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని ఆయన తెలిపారు. బుధవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ఈ విధంగా కీలకమైన వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వంలో కొన్ని డిస్టిలరీలను ఒకే వర్గం ఆధీనంలోకి తీసుకుని, హోల్ సేల్, రవాణా, రిటైల్ దుకాణాలన్నీ ఒకే నెట్‌వర్క్ ద్వారా నియంత్రించబడినట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. సరైన డిజిటల్ ట్రాకింగ్ లేకుండా లావాదేవీలు జరిగాయని అన్నారు. దీంతో నియంత్రణ లేకుండా వ్యవస్థ నడిచిందని విమర్శించారు. ప్రస్తుతం ప్రభుత్వం ఎక్సైజ్ వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు చేపట్టిందని సీఎం వివరించారు. ఇందుకోసం కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసి, కొత్త విధానాన్ని అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు.

...మిగతాది 2 లో



## భారీ అగ్ని ప్రమాదం

- మియాపూర్ రోడ్డులో ఉన్న ఫర్నీచర్ మార్కెట్‌లో మంటలు చెలరేగడంతో బీభత్సం
- కోట్లాది రూపాయల ఆస్తి నష్టం

**జయభేరి, హైదరాబాద్, మార్చి 4 :**

మేడ్చల్ జిల్లా బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో అర్ధరాత్రి వేళ భారీ అగ్ని ప్రమాదం జరిగింది. నిజాంపేట సర్కిల్ ప్రగతి నగర్ కమాన్ సమీపంలోని మియాపూర్ రోడ్డులో ఉన్న ఫర్నీచర్ మార్కెట్‌లో మంటలు చెలరేగడంతో బీభత్సం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో సుమారు 35వరకు దుకాణాలు కాలి బూడిదయ్యాయి. కోట్లాది రూపాయల ఆస్తి నష్టం వాటిల్లింది. అయితే అదృష్టవశాత్తు ఎవరికీ ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. రాత్రి సుమారు 10.40గంటల నుంచి 11 గంటల మధ్య ప్రమాదం జరిగింది. మార్కెట్‌లోని

...మిగతాది 2 లో

## ఇరాన్ కొత్త సుప్రీం నేతగా మోజ్తాబా హుసేన్ ఖమేనీ

**జయభేరి, టెహ్రాన్ మార్చ్ 4 :**



ఇరాన్ కొత్త సుప్రీం నేతగా అయతుల్లా ఖమేనీ కుమారుడు మోజ్తాబా హుసేన్ ఖమేనీ ఎన్నికయ్యారు. ఇజ్రాయిలీ మీడియా ఈ విషయాన్ని పేర్కొన్నది. ఇరాన్‌కు చెందిన నిపుణుల అసెంబ్లీ మోజ్తాబాను ఎన్నుకున్నది. అయతుల్లా అలీ ఖమేనీ వారుసుడిగా మోజ్తాబా కొనసాగనున్నారు. 36 ఏళ్ల పాటు ఇరాన్ సుప్రీం నేతగా కొనసాగిన ఖమేనీ.. గత శనివారం అమెరికాఇజ్రాయెల్ దళాలు జరిపిన దాడిలో మృతిచెందిన విషయం తెలిసిందే. ఆ దాడిలో ఖమేనీతో పాటు ఆయన కుమార్తె, అల్లుడు, మనువరాలు మృతి చెందారు. గాయపడ్డ ఖమేనీ భార్య మన్సౌరీ ఖోజసేత్ భగేర్జదే రెండు రోజుల తర్వాత ప్రాణాలు విడిచింది. మొజ్తాబా వయసు 56 ఏళ్లు. తన తండ్రి ఖమేనీ అడుగుజాడల్లో రాజకీయ, మతపరమైన వ్యవస్థలను ఆయన నడిచారు. 1969లో మషాద్‌లో మోజ్తాబా జన్మించారు. అలీ ఖమేనీ రెండో కుమారుడు ఆయన. ఆయనకు అయిదుగురు సోదరులు ఉన్నారు. టెహ్రాన్‌లో ఉన్న అలావి ఉన్నత పాఠశాలలో ఆయన చదువుకున్నారు. ఆ తర్వాత ఖోమ్‌లో మోజ్తాబా మతపరమైన విద్య నేర్చుకున్నారు. మతపరమైన శిక్షణలో ఆయన చాన్నాళ్లుగా కొనసాగుతున్నా.. అయతుల్లా ర్యాంక్‌కు మాత్రం ఇంకా చేరుకోలేదు. ఇరాన్‌ఇరాక్ మధ్య యుద్ధం సమయంలో.. హబిబ్ బెటాలియన్‌లో మోజ్తాబా విధులు నిర్వర్తించారు. ఇరాన్ సెక్యూర్టీ, ఇంటెలిజెన్స్‌లో ఉన్న ప్రముఖులతో ఆయనకు సంబంధాలు ఉన్నాయి.

## మే 11 నుంచి జనగణన



2 లో

- పక్కాగా వివరాలు నమోదు చేయాలి: సీఎస్

**జయభేరి, హైదరాబాద్, మార్చి 4 :**

దేశవ్యాప్తంగా జరగనున్న జాతీయ జనాభా గణన (జనగణన) ప్రక్రియలో భాగంగా తెలంగాణలో తొలి దశ పనులను పకడ్బందీగా నిర్వహించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఇందులో భాగంగా మే 11 నుంచి జూన్ 9 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఇళ్లు, ఇతర కట్టడాల వివరాలను నమోదు చేసే కార్యక్రమాన్ని చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కె. రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో జిల్లా కలెక్టర్లు, అన్ని శాఖల కార్యదర్శులతో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి, కీలక మార్గదర్శకాలు జారీ చేశారు. ఈసారి జనగణన ప్రక్రియలో ఒక చారిత్రాత్మక మార్పు చోటుచేసుకోనుంది. దేశ చరిత్రలోనే మొదటిసారి జనాభా లెక్కలను పూర్తిస్థాయి డిజిటల్ విధానంలో చేపట్టనున్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది ప్రత్యేక మొబైల్ అప్లికేషన్ ద్వారా నేరుగా స్మార్ట్‌ఫోన్లలో వివరాలను నమోదు చేస్తారు. ఇది సమాచార సేకరణలో వేగాన్ని, కచ్చితత్వాన్ని పెంచుతుంది.

## బాల్కా సుమన్ విడుదల



2 లో

- జైలు వద్ద కోలాహలం
- మున్సిపల్ ఎన్నికల ఘర్షణలో ఆయన హస్తం ఉందని పోలీసులు అరెస్టు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధర్యంలో రాష్ట్రమంతటా పరిస్థితి దారుణంగా తయారైందని మాజీ ఎమ్మెల్యే బాల్క
- క్యాతన్ పల్లి మున్సిపల్ ఎన్నికల సందర్భంగా మంత్రి వివేక్, ఆయన కొడుకు ఎంపీ వంశీకృష్ణ 14 మంది కౌన్సిలర్లను కొనే ప్రయత్నం
- కేవలం 7 స్థానాల్లో గెలిచిన కాంగ్రెస్, మున్సిపల్ పీఠాన్ని దక్కించుకోవాలని చూడటం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే..

## ఇది మనిషి సృష్టించిన విషాదం

- ఇరాన్‌లో 165 మంది బాలికల మృతి: కేటీఆర్

**జయభేరి, హైదరాబాద్, మార్చ్ 4 :**



ఇరాన్ పై ఇజ్రాయెల్,అమెరికా దాడులతో మధ్యప్రాచ్యం అట్టుడుకుతోంది. ఇజ్రాయెల్, అమెరికా బలగాలు వైమానికి దాడులతో ఇరాన్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌పైన, తన పరిసర దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపైన ప్రతిదాడులు చేస్తోంది. ఫలితంగా పశ్చిమాసియాలో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి.ఈ నేపథ్యంలో ఈ మారణహోమంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కామెంట్ చేశారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన దాడుల్లో ఓ బాలికల పాఠశాల నేలమట్టమవగా.. ఆ శిథిలాల కింద చిక్కుకుని 165 మంది బాలికలు ప్రాణాలు కోల్పోయారు. ఇవాళ వారి అంత్యక్రియలు విషాదకరంగా జరిగాయి.ఈ నేపథ్యంలో.. 'పాఠశాలపై ఇజ్రాయెల్, అమెరికా బలగాలు జరిపిన

...మిగతాది 2 లో

## 400 కోట్ల బంగారం ఎక్కడ

2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## ఐపీఎస్‌ల సంఖ్యను 105కు పెంచండి

సహా ఇతర అనేక ఆధునిక సవాళ్లను ఎదుర్కొంటోందని చెప్పారు. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కమిషనరేట్ల పునర్వ్యవస్థీకరణ, ఫ్యూచర్ సిటీ కమిషనర్, హైదరాబాద్ నగరంలో భారీగా పెరుగుతున్న జనాభా నేపథ్యంలో పెద్ద సంఖ్యలో ఐపీఎస్ అధికారుల అవసరం ఉందని వివరించారు. మూడో క్యాడర్ రివ్యూను నిర్దేశిత 2026 సంవత్సరంలోనే చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం 83 ఐపీఎస్ అధికారులు రాష్ట్రంలో ఉన్నారని, ఆ సంఖ్యను 105కు పెంచి కేటాయించాలని కోరారు. ఈ భేటీ సందర్భంగా మావోయిస్టుల లొంగుబాటుపై అమిత్ షా తో చర్చించారు. ఇటీవల మావోయిస్టు అగ్ర నాయకుల లొంగుబాటు, వారి పునరావాసం అంశాలు చర్చించారు. గత రెండేళ్లలో తెలంగాణ పోలీసింగ్‌లో గణనీయమైన మార్పులు వచ్చాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో 591 మంది మావోయిస్టులు ఆయుధాలను వీడి జనజీవన స్రవంతిలో కలిసిన విషయాన్ని చెప్పారు. ఇటీవల కాలంలో పలువురు మావోయిస్టు అగ్రనేతలు కూడా సాధారణ జీవితం గడిపేందుకు ముందుకు వచ్చారని, వారికి నిబంధనల ప్రకారం అందజేస్తున్న పరిహారం, పునరావాసం విషయాలను కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి వివరించారు. రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించి సహకరించాలని కూడా కోరారు. సమావేశంలో ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, DGP బి. శివధర్ రెడ్డి, ఇంటెలిజెన్స్ అడిషనల్ డీజీపీ విజయ్ కుమార్, ఎస్ఐబి ఐజీపీ బి. సుమతి పాల్గొన్నారు.

## భీకర పోరాటం

వద్ద ఆఫ్ఘన్ సైన్యానికి చెందిన 100 మందికి పైగా సాయుధ సైనికులతో పోరాడుతోంది. పాకిస్తాన్ సైనికులను చూడగానే వారిని లక్ష్యంగా చేసుకున్నారు. ఒకవైపు, ఆఫ్ఘన్ సైన్యం తోర్ఖం సరిహద్దు సమీపంలోని లాండి కోటల్ సెక్టార్‌లోని పాకిస్తాన్ ఆర్మీ పోస్టులను ఫిరంగి, రాకెట్ లాంచర్ షెల్స్‌తో కాల్చి ధ్వంసం చేయగా, మరోవైపు, ఉదయం 10:30 గంటల ప్రాంతంలో తోర్ఖం సరిహద్దు గేటు వద్ద నిలబడి ఉన్న ఒక పాకిస్తాన్ ఆర్మీ సైనికుడిని ఆఫ్ఘన్ ఆర్మీ స్నిపర్ చంపేశారు. పాకిస్తాన్‌ఆఫ్ఘనిస్తాన్ సరిహద్దులోని తోర్ఖం ప్రాంతం అత్యంత కీలకమైంది. పాకిస్తాన్ - ఆఫ్ఘనిస్తాన్ మధ్య ఆర్థిక వాణిజ్యం కూడా జరిగే అతి ముఖ్యమైన సరిహద్దు. ఈ ప్రదేశంలో పాకిస్తాన్ సైన్యం పెద్ద సంఖ్యలో ఉంది. కానీ గత 7 రోజుల్లో ఆఫ్ఘన్ సైనికులు పాకిస్తాన్ సైన్యాన్ని వెనక్కి వెళ్ళమని బలవంతం చేశారు. సమాచారం ప్రకారం పాకిస్తాన్ సైనికులు తమ ప్రాణాలను కాపాడుకోవడానికి తోర్ఖం గేట్ నుండి 6 కి.మీ దూరం వెళ్ళారని సమారం. ఇదిలావుంటే, మంగళవారం, ఇస్లామిక్ ఎమిరేట్ ఆఫ్ ఆఫ్ఘనిస్తాన్ తరపున రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. పాకిస్తాన్ సైనిక నియంత్రణలో ఉన్న భూభాగంలో ఎనిమిది భద్రతా పోస్టులను ఆఫ్ఘన్ సైన్యం స్వాధీనం చేసుకున్నట్లు డిప్యూటీ ప్రతినిధి సెదికుల్లా నుస్రత్ తెలిపారు. వీటిలో కాందహార్‌లో ఐదు, ఖోస్ట్‌లో రెండు, జాబుల్‌లో ఒకటి ఉన్నాయి. రెండు వైపులా ఘర్షణలు కొనసాగుతున్నాయి.

## అంతకు మించి

ప్రజల ఆరోగ్యాన్ని అత్యున్నత ప్రాధాన్యంగా తీసుకుంటున్నామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. గతంలో కొంతమంది తయారు చేసిన "ఓన్ బ్రాండ్స్"కే ప్రాధాన్యం ఇచ్చారని, ఇప్పుడు జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్లు అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. కొత్త విధానంలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తూ హోలోగ్రామ్‌లు, క్యూఆర్ కోడ్‌లు, బ్యాచ్ స్థాయి తయారీ ట్రాకింగ్ వంటి సాంకేతిక పద్ధతులు అమలు చేస్తున్నామని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరికలు పంపారు.
మానవ ప్రాణ నష్టంపై కూడా సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. నాసిరకం మద్యం కారణంగా సుమారు 30 వేల మంది ప్రాణాలు కోల్పోయినట్లు నివేదికలు చెబుతున్నాయని పేర్కొన్నారు. కిడ్నీ, హృదయ, కాలేయ సంబంధిత వ్యాధులు పెరిగినట్లు తెలిపారు. ఎక్సైజ్ రంగంలో సంస్కరణలతో ప్రభుత్వ ఆదాయం పెరుగుతోందని, ప్రజా ఆరోగ్యం రక్షితమవుతోందని సీఎం పేర్కొన్నారు. కొత్త విధానం ద్వారా పారదర్శకత, నియంత్రణ, ప్రజల నమ్మకం పెరుగుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

**175 నియోజకవర్గాల్లో పారిశ్రామిక పార్కులు:**
వైసీపీ హయాంలో ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ నిర్వహించలేదని సీఎం చంద్రబాబు తెలిపారు. గత ప్రభుత్వంలో యువత పొరుగు రాష్ట్రాలకు వలస వెళ్లిన పరిస్థితులు తలెత్తాయని, ఎవరికీ నైపుణ్యాలు కల్పించలేకపోయాని అన్నారు. 20 లక్షల మంది యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చి దానిపై ఓ కమిటీని కూడా నియమించామని చెప్పుకొచ్చారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అంటే చిరునామా ఏపీ ఉండేదని, ఇప్పుడు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు కేరాఫ్ అడ్రస్ అయ్యిందని హర్షించారు. 175 నియోజకవర్గాల్లో పారిశ్రామిక పార్కులు కూడా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అలాగే పారిశ్రామిక ప్రోత్సాహకాలను కూడా రూ.210 కోట్లు విడుదల చేశామన్నారు.

**విశాఖలో పెట్టుబడులు రూ.13.25 లక్షల కోట్లు:**
ఇటీవల విశాఖలో నిర్వహించిన పెట్టుబడుల సదస్సులో రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని సీఎం తెలిపారు. వాటి ద్వారా 16 లక్షల మందికి ఉద్యోగాలు వచ్చాయన్నారు.
ఎంఎస్ఎంఈలో 2.48 లక్షల మందికి, స్కిల్ డెవలప్ మెట్ ద్వారా 1.46 లక్షల మందికి, పరిశ్రమల్లో 95 వేలు, ఫుడ్ ప్రాసెసింగ్ ద్వారా 64 వేల ఉద్యోగాలు వచ్చాయని తెలిపారు. మెగా డీఎస్సీ, పోలీసు కానిస్టేబుల్స్ కలుపుకుని ప్రభుత్వ ఉద్యోగాలు 30,500 ఇచ్చామన్నారు.

## మే 11 నుంచి జనగణన

అంతేకాకుండా, పౌరులు తమ వివరాలను తామే స్వయంగా నమోదు చేసుకునేందుకు "సెల్ఫ్‌ఎన్యూమరేషన్" పేరిట ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్‌ను కూడా అందుబాటులోకి తేనున్నారు. ఈ ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ మే 11కి 15 రోజుల ముందు నుంచే ప్రారంభమవుతుందని సీఎస్ రామకృష్ణారావు తెలిపారు.

**పక్కాగా వివరాలు నమోదు చేయాలి: సీఎస్**
క్షేత్రస్థాయిలో వివరాల సేకరణలో ఎటువంటి పొరపాట్లకు ఆస్కారం ఉండకూడదని సీఎస్ స్పష్టంగా ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామం, మండలం భౌగోళిక సరిహద్దులను కచ్చితంగా నిర్ధారించుకోవాలని సూచించారు. మారుమూల గిరిజన తండాలు, పట్టణాల్లోని మురికివాడలతో సహా రాష్ట్రంలోని ఏ ఒక్క కట్టడాన్ని కూడా వదిలిపెట్టకుండా జాబితాలో చేర్చాలని ఆయన స్పష్టం చేశారు. ఈ బృహత్కార్యక్రమం విజయవంతం కావడానికి గణకులు, పర్యవేక్షకులకు నాణ్యమైన శిక్షణ ఇవ్వాలని కలెక్టర్లకు సూచించారు. ఈ సమావేశంలో పాల్గొన్న జనాభా లెక్కల విభాగం రాష్ట్ర సంచాలకురాలు భారతీ హోళికెరి, డేటా సేకరణ కోసం రూపొందించిన మొబైల్ యాప్ పనితీరు, సమాచార భద్రతకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. రాష్ట్రస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు ప్రతి ఒక్కరి బాధ్యతలను ఆమె విశదీకరించారు. ఈ డిజిటల్ విధానం వల్ల సమాచార సేకరణలో పారదర్శకత పెరగడంతో పాటు, భవిష్యత్ ప్రభుత్వ పథకాల రూపకల్పనకు కచ్చితమైన గణాంకాలు అందుబాటులోకి వస్తాయని అధికారులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

## ఇది మనిషి సృష్టించిన విషాదం

దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన 165 మంది బాలికల అంత్యక్రియలకు సంబంధించిన భయంకరమైన, మనసును కలచివేసే దృశ్యాలు..' అని పేర్కొంటూ కేటీఆర్ ఆ మరణించిన బాలికల సామూహిక సమాధుల దృశ్యాన్ని తన అధికారిక ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు.యుద్ధం ఆవశ్యకత గురించి చెబుతున్న ఉద్దేశాలు ఏవైనా ఇది మనిషి సృష్టించిన విషాదమేనని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ యుద్ధం రాబోయే తరాలకు బాధను, విషాదాన్ని మాత్రమే మిగిల్చుతుందని తన ఎక్స్ పోస్టులో రాసుకొచ్చారు.

# 400 కోట్ల బంగారం ఎక్కడ




పోలీసుల ఎదుట కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్ తో మావోయిస్టు పార్టీ కుదేలైపోయింది. ఇప్పటికే వందలాది మంది మావోలు మృత్యువాత పడగా, పలువురు అగ్రనేతలు పోలీసులు ఎదుట లొంగిపోయారు. దేవ్‌జీ, మల్ల రాజిరెడ్డి, మల్లోజుల వేణుగోపాల్, ఆశన్న, నరసింహారెడ్డి వంటి అగ్రనేతలంతా లొంగిపోవడంతో ఇక ఆ పార్టీ దేశంలో కనుమరుగవ్వడం ఖాయమనే ప్రచారం సాగుతోంది. ఈ క్రమంలో వారు పార్టీ కోసం సేకరించిన డబ్బు, నగలు ఎక్కడున్నాయనే విషయంలో పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది.కేవలం డబ్బు, బంగారమే కాకుండా మావోయిస్టులకు సంబంధించిన పలు విలువైన డ్యాక్యుమెంట్లు, ఆధునిక ఆయుధాలు అడవుల్లో రహస్య ప్రదేశాల్లో దాచి ఉంచినట్లు ప్రచారం సాగుతోంది. వాటి వివరాలను సేకరించడం కోసం కేంద్ర దర్యాప్తు సంస్థలు మావోయిస్టు పార్టీ అగ్రనేతలను తీవ్రంగా ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. మావోయిస్టుల్లో అగ్రనేతలుగా ఉన్నవారంతా ప్రస్తుతం పోలీసుల సమక్షంలో ఉన్నారు. దీంతో పార్టీ నిధులు, నిల్వల గురించి వారికి తెలిసి ఉంటుందన్న కోణంలో విచారిస్తున్నట్లు తెలుస్తోంది. దీనికోసం కేంద్ర నిఘా సంస్థలు ఇప్పటికే హైదరాబాద్ చేరుకున్నాయి. కేంద్ర నిఘా వర్గాలకు చెందిన ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ), నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ), రిసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్ (రా), ఆర్మీ ఇంటెలిజెన్స్‌తో పాటు కేంద్ర సాయుధ బలగాలకు చెందిన సీఆర్పీఎఫ్, సీఐఎస్ఎఫ్ తదితర బృందాలు ఇప్పటికే వారిని పలు విషయాలపై ప్రశ్నిస్తున్నాయి. గడచిన ఆరు నెలల కాలంలో మావోయిస్టు పార్టీకి చెందిన అగ్రనేతలు ఒక్కరొక్కరుగా లొంగిపోతున్న విషయం తెలిసిందే. వారు లొంగిపోతున్న సమయంలో కొంతమది నేతలు తమ వద్ద ఉన్న ఆయుధాలు, నగదు, డబ్బు పార్టీ అధిష్టానానికి అప్పగించి వచ్చినట్లు చెబుతున్నారు. మరికొంతమంది ఆయుధాలతో లొంగిపోయినప్పటికీ పార్టీకి చెందిన నిధులు, బంగారం మాత్రం అడవుల్లో ఉన్న క్యాడర్‌కు అప్పగించి వచ్చినట్లు చెబుతున్నారు. ఇటీవల లొంగిపోయిన కేంద్ర కమిటీ సభ్యులు, పొలిట్‌బ్యూరో మెంబర్ మల్లోజుల వేణుగోపాల్ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని స్పష్టం చేశారు. తాము ఆయుధాలతో విప్లవం రాదు అని నమ్మాం కనుక తమ వద్ద ఉన్న ఆయుధాలతో లొంగిపోయామని, అయితే ఇంకా పార్టీలో ఉన్న క్యాడర్ అడవుల్లో ఉండి పోరాడేందుకు సిద్ధంగా ఉండటంతో తన వద్ద ఉన్న ఆరుకోట్ల రూపాయల నగదు, ఆరు కిల్లో బంగారం పార్టీ నేతలకు అప్పగించి వచ్చినట్లు స్పష్టం చేశారు. దాన్ని భూతల్లి కడుపులోనే దాస్తామని కూడా ఆయన వెల్లడించారు. మావోయిస్టు పార్టీ వద్ద పెద్ద ఎత్తున ఆయుధాలతోపాటు వందల కోట్ల రూపాయలు, అంతకు మించి విలువైన బంగారం ఉందని నిఘా వర్గాలు భావిస్తున్నాయి. ఇటీవలి కాలంలో మావోయిస్టు అగ్రనేతల్లో ఒకరు, పీఎల్‌జీఏ కమాండర్ అయిన బార్సేదేవాను పోలీసులు పట్టుకున్న విషయం తెలిసిందే.
ఆ సమయంలో తెలంగాణ చరిత్రలోనే మొదటి సారిగా మావోయిస్టు డంప్ నుంచి రూ.20 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకోవడం గమనార్హం. అలాగే 48 అత్యంత అధునాతన ఆయుధాలు పోలీసులకు మావోయిస్టులు అప్పగించారు. మావోయిస్టులు కొవిడ్ సమయంలో తమ వద్ద ఉన్న కోట్లాది రూపాయల నగదును బంగారం రూపంలోకి మార్చినట్లు తెలుస్తోంది. ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తెలంగాణ, ఒడిసా, ఏపీ తదితర రాష్ట్రాల్లోని కాంట్రాక్టర్లు, వ్యాపారవేత్తల నుంచి మావోయిస్టులు పార్టీ ఫండ్ సేకరించినట్లు తెలుస్తోంది. ఈ మొత్తాన్ని కేంద్ర కమిటీకి పంపిస్తుంటారు. పార్టీకి నిధుల సేకరించడానకి విస్తృత నెట్‌వర్క్ ఉందని జాతీయ విచారణ సంస్థ (ఎన్ఐఏ) ధృవీకరించింది. ఈ క్రమంలోనే సుమారు రూ.400 కోట్ల విలువైన నగదును బంగారం రూపంలోకి మార్చినట్లు తెలుస్తోంది. అయితే అది ఎవరివద్ద ఉందనేది ప్రస్తుతం సస్పెన్స్..ఇక బీజాపూర్ పోలీసులు మూల్‌వాసీ బచావో మంచ్ (ఎంబీఎం) సభ్యులు ఇద్దరు మావోయిస్టుకు పార్టీకి చెందిన బ్యాంకు ఖాతాలో రూ.6 లక్షలు డిపాజిట్ చేస్తుండగా అరెస్టు చేశారు. మజ్దూర్ సంఘటన సమితి (ఎంఎస్ఎస్) సభ్యులు కొందరు నిధులు సేకరించి, బ్యాంకుల్లో డిపాజిట్లు చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. గతంలో మావోయిస్టు స్పెషల్ ఏరియా కమిటీ సభ్యుడైన ప్రద్యుమ్నశర్మ బంధువు ఒకరు చెన్నైలోని వైద్య కళాశాలలో చేరగా, ఆమె ఫీజుకు కావాల్సిన కోటి 13 లక్షలను బ్యాంకు ఖాతాల ద్వారా ఇచ్చినట్లు ఎన్ఐఏ గుర్తించడం సంచలనంగా మారింది. పార్టీ సానుభూతి పరుల వద్దే ఇంత సొమ్ము ఉంటే ఇంకా పార్టీ డంపులలో ఎంత మేరకు ఉంటుందన్న చర్చ సాగుతోంది. మావోయిస్టు పార్టీ నోట్ల మార్పిడి సమయంలో తీవ్రంగా నష్టపోయినట్లు పార్టీ అగ్రనేతలు చెబుతున్నారు.
సుమారు రూ.200 కోట్ల వరకు పాత నోట్లను మార్పిడి చేసేందుకు పార్టీ అగ్రనాయకత్వం ప్రయత్నించినట్లు తెలుస్తోంది.ఈ క్రమంలో కొంతమొత్తాన్ని మార్చినప్పటికీ మిగతది సాధ్యం కాలేదని చెబుతున్నారు. నోట్ల మార్పిడి కోసం పార్టీ సానుభూతిపరులు, ఇతర వర్గాల వారికి పార్టీ నగదును అప్పగించగా వారు డబ్బును మార్చినప్పటికీ తిరిగి పార్టీకి ఇవ్వలేదన్న ప్రచారం ఉంది. దీన్ని అగ్రనేత ఒకరు ధృవీకరించారు కూడా. అలా పెద్దమొత్తంలో పార్టీ ఆర్థికంగా నష్టపోయినట్లు నేతలు చెబుతున్నారు.మావోయిస్టు పార్టీ వద్ద సుమారు 400 కిలోల బంగారం ఉండి ఉంటుందని దర్యాప్తు సంస్థలు అనుమానిస్తున్నాయి. అయితే దాన్ని ఎక్కడ దాచారనేది ప్రస్తుతం చర్చనీయంశంగా మారింది. బంగారాన్ని అంతా అడవుల్లోని డంపు ల్లో దాచి ఉండటారని కేంద్ర, రాష్ట్ర నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. దాదాపు రూ.500 కోట్ల బంగారం మావోయిస్టు పార్టీ వద్ద ఉందనే అనుమానంతో ఆయా సంస్థలు మావోయిస్టులను ప్రశ్నిస్తున్నాయి. అయితే పార్టీ అగ్రనేతలు పార్టీ నిలువుల గురించి నోరు తెరుస్తారా? లేదా అనేది ప్రస్తుతం మిలియన్ డాలర్ల ప్రశ్న.

## భారీ అగ్ని ప్రమాదం

మూడో ఓ షాపునకు సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభం నుంచి నిప్పు రవ్వలు పడ్డాయి. అవి పక్కనే ఉన్న ఫర్నీచర్ షాప్‌నకు అంటుకున్నా. అలా ఆ ప్రాంతమంతా ఒక్కసారిగా అగ్ని కీలలు వ్యాపించాయి. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగిందని ప్రాథమికంగా నిర్ధారించారు. మంటలు గమనించిన వెంటనే స్థానికులు అప్రమత్తమై ఆర్పే ప్రయత్నం చేశారు. ఫర్నీచర్ దుకాణాల్లో కలపతోపాటు రెజీన్, పెయింట్లు వంటి త్వరగా మండుకునే వస్తువులు ఉండటంతో మంటలు నిమిషాల వ్యవధిలోనే మార్కెట్ అంతటా విస్తరించాయి. మంటల తీవ్రతకు దుకాణాల్లో ఉన్న గ్యాస్ సిలిండర్లు పేలడంతో పెద్ద ఎత్తున శబ్దాలు వచ్చాయి. ఇది స్థానికులను మరింత భయభ్రాంతులకు గురి చేసింది. మంటలు ఎగసిపడుతుంటే ఏం చేయలేని పరిస్థితి నెలకొంది.ఈ ప్రమాదంలో ఆస్తి నష్టం తీవ్రంగా ఉంది.
మార్కెట్‌లో మొత్తం 43 నుంచి 60 వరకు షాపులు ఉండగా, దాదాపు 35 షాపులు మంటలకు ఆహుతయ్యాయి. ప్రాథమిక అంచనాల ప్రకారం,మొత్తం ఆస్తి నష్టం సుమారు 10 కోట్ల రూపాయల వరకు ఉండొచ్చని తెలుస్తోంది. గత ఎనిమిదేళ్లుగా ఇక్కడే వ్యాపారం చేసుకుంటున్న రమాదేవి అనే మహిళ మాట్లాడుతూ తమ షాపులో ఉన్న సుమారు 20 లక్షల రూపాయల విలువైన వస్తువులన్నీ కాలిపోయాయని, తన బిడ్డలతో కలిసికట్టుబట్టలతో బయటకు రావాల్సి వచ్చిందని కన్నీటి పర్యంతమయ్యారు.
చాలా మంది వ్యాపారస్తులు తమ షాపుల నుంచి కనీసం చిన్న వస్తువును కూడా తీసుకోలేకపోయారని, తమ జీవితాలు విగత జీవులుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే బాచుపల్లి పోలీసులు, అగ్ని మాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. కూకట్‌పల్లి, జీడిమెట్ల, పటాన్ చెరు, మాదాపూర్ కేంద్రాల నుంచి సుమారు ఐదారు ఫైర్ ఇంజిన్లు మంటలను ఆర్పే పనిలో నిమగ్నమయ్యాయి. వీరికి తోడుగా జీహెచ్ఎంసీ వాట్ ట్యాంకర్లు, హైడ్రా, డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగాయి. స్థానికంగా ఉన్న కాలేజీ విద్యార్థులు,యువకులు కూడా మంటలు అదుపులోకి తెచ్చేందుకు అధికారులకు సహకరించారు. సర్వం కోల్పోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలవాలని బాధితులు వేడుకుంటున్నారు.

# బాల్కా సుమన్ విడుదల

- జైలు వద్ద కోలాహలం
- మున్సిపల్ ఎన్నికల ఘర్షణలో ఆయన హస్తం ఉందని పోలీసులు అరెస్టు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధర్యంలో రాష్ట్రమంతటా పరిస్థితి దారుణంగా తయారైందని మాజీ ఎమ్మెల్యే బాల్క
- క్యాతన్ పల్లి మున్సిపల్ ఎన్నికల సందర్భంగా మంత్రి వివేక్, ఆయన కొడుకు ఎంపీ వంశీకృష్ణ 14 మంది కౌన్సిలర్లను కొనే ప్రయత్నం
- కేవలం 7 స్థానాల్లో గెలిచిన కాంగ్రెస్, మున్సిపల్ పీఠాన్ని దక్కించుకోవాలని చూడటం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే..



✍ జయభేరి, అదిలాబాద్, మార్చి 4 :

క్యాతనపల్లిలో మంత్రిపై దాడి కేసులో రిమాండ్‌లో ఉన్న బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ బుధవారం జైలు నుంచి విడుదలయ్యారు. క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నికల వేళ చోటు చేసుకున్న ఉద్రిక్త పరిస్థితులు, ఘర్షణలో ఆయన హస్తం ఉందని పోలీసులు అరెస్టు చేశారు. ఇది ఆదిలాబాద్ జిల్లాలో సంచలనంగా మారింది. క్యాతనపల్లి మున్సిపాలిటీ పీఠాన్ని దక్కించుకునే క్రమంలో రాజకీయ పార్టీల మధ్య తలెత్తిన ఘర్షణలు హింసాత్మకంగా మారాయి. ఈ ఘటనలో బాల్క సుమన్ ప్రత్యక్షంగా ప్రమేయం కలిగి ఉన్నారని శాంతిభద్రతలకు విఘాతం కలిగించారని ఆరోపిస్తూ పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. ఈ క్రమంలోనే గత నెల 18వ తేదీన ఆయనను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం రిమాండ్ విధించింది. అప్పటి నుంచి ఆయన ఆదిలాబాద్ జిల్లా జైలులో ఉన్నారు. బాల్క సుమన్ అరెస్టు అక్రమమని, కనీస నిబంధనలు పాటించలేదని ఆయన తరుపు న్యాయవాదులు కోర్టులో గట్టిగా వాదించారు. ముఖ్యంగా అరెస్టు చేసే సమయంలో సుప్రీంకోర్టు జారీ చేసిన విధి విధానాలను పోలీసులు పట్టించుకోలేదని ఆరోపించారు. మరోవైపు కేసు తదుపరి విచార కోసం సుమన్‌ను తమ కస్టడీకి అప్పగించాలని పోలీసులు మంచిర్యాల కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే ఇరు పక్షాల వాదనలను విన్న న్యాయస్థానం పోలీసుల కస్టడీ పిటిష్‌ను తోసిపుచ్చింది. సోమవారం నాడు ఈ కేసులో కీలక మలుపు తిరిగింది. జిల్లా సెషన్స్ జడ్జి ఏ వీరయ్య బాల్క సుమన్‌కు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ తీర్పు ఇచ్చారు. పాతికవేల పూచీకత్తుతో పాటు ఇద్దరు వ్యక్తుల ష్యూరిటీలు సమర్పించాలని ఆదేశించారు. అయితే ఈ బెయిల్‌తో పాటు కోర్టు కొన్ని కఠిన నిబంధనలను విధించింది. ఈ కేసులో ఏ 1, ఏ2 ఏ4, ఏ8 నిందితులుగా ఉన్న వారు ప్రతి ఆదివారం తప్పనిసరిగా రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్‌లో హాజరైన సంతకం చేయాలని న్యాయమూర్తి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధర్యంలో రాష్ట్రమంతటా పరిస్థితి దారుణంగా తయారైందని మాజీ ఎమ్మెల్యే బాల్క దుయ్యబట్టారు. క్యాతన్ పల్లి మున్సిపల్ ఎన్నికల సందర్భంగా మంత్రి వివేక్, ఆయన కొడుకు ఎంపీ వంశీకృష్ణ 14 మంది కౌన్సిలర్లను కొనే ప్రయత్నం చేశారని అన్నారు. బ్లాంక్ చెక్కులు ఇచ్చి ప్రలోభ పెట్టే ప్రయత్నం చేశారని ఆరోపించారు. కోట్లాది రూపాయలు ఆఫర్లు చేసారని.. అయినా తమ వాళ్ళు తలొగ్గలేదన్నారు.
దీంతో ఏం చేయాలో అర్థం కాక మంత్రి, ఎంపీ ఇద్దరు ముగ్గురు కాంగ్రెస్ కౌన్సిలర్లకు మందు తాగించి వాళ్ళతో తమ మహిళా కౌన్సిలర్ల మీద దౌర్జన్యం చేశారని మండిపడ్డారు. ప్రజా తీర్పును మంత్రి వివేక్ గౌరవించడం లేదని విమర్శించారు. ఇక అక్కడ గొడవ సందర్భంగా రాళ్లు విసిరినోళ్ళ మీద కేసులు బుక్ కాలేదని... మా 25 మంది మీద కేసులు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ ఎన్నిక సందర్భంగా క్యాతనపల్లి మున్సిపల్ ఆఫీసుకు వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారని తెలిపారు.
మంత్రి వివేక్ కాన్వాయ్ ను ఎలా పంపించారని అడిగితే పోలీసులు తమపై లాఠీ చార్జి చేశారని పేర్కొన్నారు. వాళ్లు దాడి చేస్తే.. మాపైనే రివర్స్‌లో కేసు పెట్టారని మండిపడ్డారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో కేవలం 7 స్థానాల్లో మాత్రమే గెలిచిన కాంగ్రెస్ పార్టీకి మున్సిపల్ పీఠం ఎలా వస్తుందని మండిపడ్డారు. జిల్లాలోని కలెక్టర్ నుంచి తహశీల్దార్ వరకు ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఉద్యోగులుగా కాకుండా విశాఖ ఇండస్ట్రీస్ ఉద్యోగులుగా పనిచేస్తున్నారని ఎద్దేవా చేశారు.

# మహాసంప్రోక్షణతో తెరుచుకున్న గుట్ట ఆలయం

- శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి హుండీ ఆదాయం రూ.8.18 లక్షలు

**జయభేరి, యాదగిరిగుట్ట, మార్చి 04 :**



తెలంగాణ ప్రసిద్ధి క్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయాన్ని మహాసంప్రోక్షణ అనంతరం తెరిచారు. చంద్రగ్రహణం కారణంగా మంగళవారం ఉదయం 7 గంటలకు ఆలయాన్ని మూసివేసిన అర్చకులు బుధవారం తెల్లవారుజామున 3 గంటలకు ఆలయాన్ని తెరిచారు. బుధవారం ఉదయం ఆలయాన్ని తెరిచిన అనంతరం ఆలయ అర్చకులు,ఆలయ సిబ్బంది మహా సంప్రోక్షణ, ఆలయ శుద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి సుప్రభాతం, అర్చన తదితర పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామి వారి దర్శనాలు కల్పించగా దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

**యాదగిరీశుడికి నిత్యపూజలు..**

శ్రీలక్ష్మి నరసింహ స్వామి వారికి నేత్రపర్వంగా నిత్య



పూజలు కొనసాగుతున్నాయి. బుధవారం తెల్లవారుజామున మహాసంప్రోక్షణ అనంతరం ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం, అర్చనను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతించారు. శ్రీలక్ష్మీ నర సింహస్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరిగిన శ్రీసుదర్శన నారసింహ హోమం,నిత్య కల్యాణం, నిత్య బ్రహ్మోత్సవం, వెండి జోడి సేవ, స్వర్ణ పుష్పార్చన, శ్రీ సత్య నారాయణస్వామి వ్రత పూజలలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కొండపైన కొలువైన శ్రీపర్వతవర్ధినీ సమేత రామలింగే శ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకొని ఆలయంలో జరిగిన నిత్యపూజలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**శ్రీనారసింహుడి నిత్యరాబడి..**

స్వామి వారికి నిత్యరాబడిలో భాగంగా బుధవారం రూ.8,18,368 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రధాన బుకింగ్ రూ.85,150, బ్రేక్ దర్శనం రూ.50,400, వీఐపీ దర్శనం రూ.1,05,000, కొండపైకి వాహన ప్రవేశం రూ.1,07,500, సువర్ణ పుష్పార్చన రూ.7,400, ప్రసాద విక్రయం రూ.3,61,780, కల్యాణకట్ట రూ.16,000తో పాటు వివిధ శాఖలు,పాతగుట్ట ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.

# మెడికల్ విద్యార్థులకు ఫీజు చెక్కుల పంపిణీ చేసిన కేటీఆర్

- మెడికల్ విద్యార్థులకు అండగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**జయభేరి, ఉప్పల్ :**



పేద విద్యార్థుల ఉన్నత చదువులకు భరోసా కల్పిస్తూ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. బి.ఎల్.ఆర్ (BLR) చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన 16 మంది ఎంబీబీఎస్ (MBBS) విద్యార్థులకు వారి విద్యా సంవత్సరం ఫీజుల నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతుల మీదుగా జరిగింది. ఈ సందర్భంగా కేటీఆర్ విద్యార్థులకు చెక్కులను అందజేస్తూ, వారి భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపారు. కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా, సమాజంలోని పేద విద్యార్థులు వైద్యులుగా ఎదిగేందుకు తన వంతు సహకారాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ప్రతి ఏటా అనేక మంది విద్యార్థులకు విద్యా ఖర్చుల కోసం ఆర్థిక సాయం చేస్తూ, వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్న లక్ష్మారెడ్డి గారి సేవా దృక్పథం అందరికీ ఆదర్శనీయమని కేటీఆర్ కొనియాడారు. బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. పేదరికం కారణంగా ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతోనే 'బి.ఎల్.ఆర్ చారిటబుల్ ట్రస్ట్' ద్వారా నిరంతరం ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా వైద్య విద్య అభ్యసించే విద్యార్థులకు ఫీజుల భారం కలగకుండా చూస్తామని, వారు భవిష్యత్తులో గొప్ప వైద్యులుగా మారి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న 16 మంది వైద్య విద్యార్థులు మరియు వారి కుటుంబ సభ్యులు, తమ చదువుకు అండగా నిలిచిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తమకు శుభాకంక్షలు తెలిపిన కేటీఆర్ కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

# నిషేధిత జాబితా తొలగించకపోతే ఉద్యమమే

- యాదగిరిపల్లి, బీసి కాలనీ, ఇందిరా కాలనీలో నిషేధిత జాబితాలో 762మంది ఇళ్లు
- రెగ్యులర్ చేసే వరుకు పోరాటం చేస్తాం : బిజేపి నేతలు


**జయభేరి, యాదగిరిగుట్ట, మార్చి 4 :**



యాదగిరిగుట్ట మున్సిపల్ పరిధిలోని యాదగిరిపల్లి, బీసీకాలనీ,ఇంద్రకాలనీలో నిషేధిత జాబితాలో చేర్చిన 762ఇళ్లను తక్షణమే రెగ్యులరైజ్ చేయాలని... నిషేధిత జాబితా నుంచి తొలగించాలని...లేని పక్షంలో ఆయా ప్రజలతో కలిసి భారీ ఎత్తున ఉద్యమం చేపడుతామని బిజేపి పార్టీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రచ్చ శ్రీనివాస్,బిజేపి పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్ తెలిపారు. యాదగిరిగుట్ట మున్సిపల్ పరిధిలోని యాదగిరిపల్లి, బీసి కాలనీ, ఇంద్రకాలనీలో నిషేధిత జాబితాలో ఉన్న ఇళ్ల బాధితులను బిజేపి నాయకులు కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పేదల కడుపు కొట్టడానికే తెలంగాణ రాష్ట్రంలోని అధికారంలోకి వచ్చిందని, అందుకే ప్రజలను ఇబ్బందుల పాలు చేస్తుందన్నారు. ఇందిరాకాలనీ,బీసీకాలనీ, యాదగిరిపల్లిలో సుమారు 762 ఇళ్లను ప్రభుత్వం నిషేధిత జాబితాలోకి చేర్చిందని,దీంతో ఆ ఇళ్లను అమ్మడం,కొనడం,లోన్ తీసుకోవడం జరగదని తెలిపారు. ప్రభుత్వం తీరుతో 762 కుటుంబాలు రోడ్డు మీద పడ్డాయని,మున్సిపల్ ట్యాక్స్‌లు మాత్రం ముక్కు పిండి వసూలు చేస్తున్న తీరు సిగ్గుచేటని ఆరోపించారు. తక్షణమే స్థానిక ఎమ్మెల్యే, అధికారులు రెగ్యులర్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, లేదంటే బాధితులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని బిజేపి నేతలు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజేపి నేతలు భానుచందర్, బోడ సురేష్, దొమ్మాట ప్రభాకర్, ఆలేటి కర్ణ, సురేష్, బోడ బుచ్చిబాబు, వాల్మీకి అజయ్, నరేష్, చైతన్య, వంశీ, అనిల్, శ్యామ్, ప్రవీణ్, నిఖిల్, రమేష్, విజయ్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# గుడి నిర్మాణం తర్వాతే పూజలు జరగాలి

**జయభేరి, డిండి :**



డిండి మండలం వావిల్ కోల్ (వడ్డెరగూడెం) ప్రజలందరికీ తెలియజేయునది ఏమనగా ఈదమ్మ తల్లి గుడి నిర్మాణం అవుతుంది కాబట్టి ఈదమ్మ తల్లి మహాందాత గుడి నిర్మాణం పూర్తి కాకముందుకే అమ్మవారి ప్రతిష్ఠ చేయకముందుకే అమ్మవారి గుడిలో దీపం పెట్టడం జరిగింది కాబట్టి పంతులు అయ్యగారు చెప్పారు.

గుడిలో దీపం పెట్టొద్దు అని చెప్పారు గుడి ముందల మేకలు, కోళ్లు కోయరాదు ఇది కావాలని ఓర్సు పెంటయ్య కావాలని దీపం పెట్టడం జరిగినది. ఊరి ఇదమ్మ తల్లి కాదా ఈ సమస్య ఊరు ఈదమ్మ తల్లి కాదా ఈ సమస్యను అందరూ కలిసి నిర్ణయం తీసుకోండి ఇది వడ్డెర గూడెం ప్రజలందరూ ఈదమ్మ తల్లి అందరికీ తెలియడం జరుగుతుంది. కాబట్టి వడ్డెర గూడెం ప్రజలందరూ నిర్ణయం తీసుకోవాలి అని ఓర్సు ముత్యాలు ఒక ప్రకటనలో తెలియజేసినారు.



# నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం?

**జయభేరి, పరవాడ:**

పరవాడ మండలంలో ఈపీడీసీఎల్ పరిధిలో గల పలు ప్రాంతాలలో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడే అవకాశాలు ఉండొచ్చని కసింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి మురళీకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 220 కె.వి హై టెన్షన్ విద్యుత్తు లైన్స్ పనుల నిర్వహణలో భాగంగా 33 కెవి పరవాడ సబ్స్టేషన్, 33 కెవి వాడ చీపురుపల్లి సబ్ స్టేషన్, 33 కెవి పెదమసిడివాడ సబ్ స్టేషన్ల పరిధిలో గల గ్రామాలకు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడే అవకాశాలు ఉండొచ్చని తెలిపారు. పైన తెలిపిన సబ్ స్టేషన్ల పరిధిలో గల ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి, ఒకవేళ విద్యుత్ అంతరాయం ఏర్పడినట్లయితే సహకరించాలని ఈ ఈ మురళీకృష్ణ కోరారు.

# అజీజ్ కి ఆర్థిక సహాయం

- బిఆర్ఎస్ పార్టీ దేవరకొండ మున్సిపాలిటీ 18వ వార్డు కౌన్సిలర్ విరమోని అంజి గౌడ్



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మున్సిపాలిటీ 17వ వార్డుకు చెందిన యూట్యూబ్ ర్ అజీజ్ కి బిఆర్ఎస్ పార్టీ దేవరకొండ మున్సిపాలిటీ 18వ వార్డు కౌన్సిలర్ విరమోని అంజి గౌడ్ రూ.5000 ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అజీజ్ అండగా ఉంటా అని ఆయన భరోసా ఇచ్చారు. అజీజ్ కే కాకుండా వార్డు ప్రజలకు కౌన్సిలర్ వీరమోని అంజి గౌడ్ ఎప్పుడు ఏదో విధంగా సహాయపడుతూనే ఉంటాడని వార్డు ప్రజలు తెలియజేసినారు.



# ఘనంగా హోలీ ఉత్సవాలు

- పార్సిగుట్టలో మహిళల సంతోషాలు

**జయభేరి, పార్శి గుట్ట :**

ఏడాదికి ఒకసారి వచ్చే హోలీ పండుగ తమ జీవితాల్లో కష్టాలను మరిచిపోయి సంతోషాలతో ఒకరినొకరు పలకరించుకుంటూ రంగులు చల్లుకుంటూ తమ ఆనందాలను వెలిపించుకునే ఈ పర్వదినాన సంజీవపురం పార్సిగుట్టలో మహిళలు తమ స్నేహితులతో కలిసి హోలీ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా మధ్యతరగతి బతుకుల్లో కష్టాలు, సుఖాలు ఎలాగూ వచ్చి పోతున్నాయో హోలీ పండుగలు అన్ని రంగులు మా జీవితాల్లో కష్టాలను కన్నీళ్లను తుడిచేస్తూ సంతోషాలను అందిస్తుందని పలువురు మహిళలు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో దీన, నామిక, జయమ్మ, వసుంధర, పద్మ, కళావతి, తదితర మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు..

# మాల్ ప్రాక్టీస్ జరగకుండా చూడాలి

- ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన యాదాద్రి భువనగిరి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బాస్కర్ రావు



**జయభేరి, యాదగిరిగుట్ట, మార్చి 04 :**

ఇంటర్మీడియెట్ పరీక్షలో మాల్ ప్రాక్టీస్‌కు ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు ఆదేశించారు. బుధవారం యాదగిరిగుట్ట పట్టణ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సౌకర్యాలు,సీసీ కెమెరాల వ్యవస్థ,విద్యార్థుల హాజరు శాతాన్ని ఆయయన పరిశీలించారు. అనంతరం భాస్కర్‌రావు మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు జరుగుతున్నాయని, ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా ,పారదర్శకంగా నిర్వహిస్తున్నామన్నారు. పరీక్షలు రాసేందుకు వచ్చిన విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని,ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జవాబు పత్రాల రవాణాకు పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# రావాడ రీసర్వే గ్రామసభలో సాగు పట్టాల కోసం రైతుల వినతి



**జయభేరి, పరవాడ :**

పరవాడ మండలం రావాడ గ్రామ పంచాయతీ పరిధిలో ప్రభుత్వం నిర్వహిస్తున్న భూముల రీసర్వే కార్యక్రమం సందర్భంగా గ్రామ సచివాలయంలో నిర్వహించిన గ్రామసభలో రైతులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. రావాడ రెవిన్యూ సర్వే నెం. 418లో గొల్లగుంట గ్రామం ముస్లిం మైనార్టీ తరగతికి చెందిన పలువురు రైతులు వారి తాత ముత్తాతల నుండి వారసత్వంగా సంవత్సరాలుగా జీడీ మామిడి తోటలతో సాగు చేస్తూ వచ్చిన పలాసయం ద్వారా కుటుంబ పోషణ జీవనోపాధి పొందుతున్నామని సర్వే నెం. 418లో ఉన్న తమ భూములకు అధికారికంగా సాగు పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం 30 మంది రైతులు సమిష్టిగా స్థానిక సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు ఆధ్వర్యంలో రెవిన్యూ అధికారులకు రైతులు తమ వినతిపత్రాలు అందజేశారు. ప్రస్తుతం రావాడ రెవిన్యూలో ప్రభుత్వం నిర్వహిస్తున్న భూముల రీసర్వే ప్రక్రియలో భాగంగా సర్వే నెం. 418లో సాగు చేస్తున్న రైతులకు సర్వే నిర్వహించి ప్రభుత్వ రికార్డుల్లో నమోదు చేసి, రైతులకు సాగు హక్కు పత్రాలు జారీ చేయాలని వారు ప్రభుత్వానికి, అధికారులకు విజ్ఞప్తి చేశారు.

# ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా హోలీ వేడుకలు

- రంగులు చల్లుతూ అందరిని ఉత్సాహపరిచిన మల్లారెడ్డి



**జయభేరి, శామీర్ పేట్, మర్చి 4:**

హోలీ పండుగ సంబురాలు బోయిన్ పల్లిలోని ఎమ్మెల్యే మల్లారెడ్డి క్యాంపు కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే మల్లారెడ్డి మరియు పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు పాల్గొని హోలీ సంబరాల్లో మునిగితేలారు. ఇక ఎమ్మెల్యే మల్లారెడ్డి చిన్నారులతో హోలీ వేడుకల్లో పాల్గొని అందరినీ ఉత్సాహపరిచారు. హోలీ పండుగ ఐక్యత, స్నేహ సంబంధాలను పెంపొందిస్తుందని, అన్నారు. ఈ హోలీ అందరి జీవితాల్లో రంగులమయం కావాలని ఆయన ఆకాంక్షించారు.



## కూతురు పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు ఎగ్జామ్స్ సామాగ్రి

జయభేరి, దేవరకొండ :

WAM మహిళా విభాగ దేవరకొండ స్టేట్ బాడీ లీడర్ శ్రీమతి చిదెళ్ల శ్రీదేవి వెంకటేశ్వర్లు కుమార్తె చిరంజీవి శ్రీ వైష్ణవి పుట్టినరోజు సందర్భంగా శ్రీదేవి పుట్టి పెరిగిన మర్రిగూడెం లోనీ గవర్నమెంట్ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు పరీక్షా సామాగ్రి అందించారు. శ్రీదేవి మాట్లాడుతూ తాను చదువుకున్న స్కూల్లో విద్యార్థులకు పరీక్ష లకు ఉపయోగపడే సామాగ్రిని తన కూతురు పుట్టినరోజు సందర్భంగా ఇచ్చినందుకు చాలా ఆనందంగా సంతోషంగా ఉన్నదని తెలియపరిచినారు.

## బాధిత కుటుంబానికి అండగా బీజేపీ నాయకులు



జయభేరి, దేవరకొండ :

దేవరకొండ మున్సిపల్ ఎన్నికల సందర్భంగా చిన్న హామీల పులకరం వెంకటయ్య మరణం పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ, వారి కుటుంబాన్ని పరామర్శించిన ఒకటో వార్డ్ కౌన్సిలర్ గుండాల పద్మ అంజయ్య తక్షణ సహాయంగా ఒక క్వింటాల్ బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రజల కష్టసుఖాల్లో అండగా నిలబడటం భారతీయ జనతా పార్టీ విధానమని తెలిపారు. పేదలు బలహీన వర్గాల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు బెజవాడ శేఖర్ , సముద్రాల సహదేవుడు, నారాయణ చండీశ్వర్, చిలక రాజు, బుక్కు కాసుల శంకరయ్య తదితరులు పాల్గొన్నారు. బాధిత కుటుంబ సభ్యులు నాయకులకు కృతజ్ఞతలు తెలియజేసినారు.

## మృతుని కుటుంబ సభ్యులకు ప్రదీప్ గౌడ్ పరామర్శ



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో బుధవారం మృతుని కుటుంబ సభ్యులకు సీనియర్ నాయకుడు కాటం ప్రదీప్ కుమార్ గౌడ్ పరామర్శించారు. స్థానికుడైన శాలి వెంకటన్న అనారోగ్యం కారణంగా మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న కాటం ప్రదీప్ కుమార్ గౌడ్ మృతుని ఇంటి వద్దకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుని పార్థీవ దేహం పై పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు జెట్టి నరసింహారెడ్డి, కురువ రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కౌన్సిలర్ కు ఆటో యూనియన్ ఘన సన్మానం



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలో బుధవారం మీన్గవాని పల్లి 8వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ జోగి గోవిందును దేవరకద్ర మున్సిపాలిటీ, దేవరకద్ర మండల ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో జోగి గోవిందు 8వ వార్డు నుంచి పోటీ చేసి గెలుపొందారు. ఒక ఆటో డ్రైవర్ గా ఉంటూనే ఆయన మున్సిపాలిటీ కౌన్సిలర్ గా పోటీ చేసి విజయం సాధించారు. దీంతో సాటి ఆటో యూనియన్ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. గోవిందు కు పూలమాలవేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ సంఘం అధ్యక్షుడు కెంగూరి రాముతోపాటు ఆటో సభ్యులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్ లో భారీ గా డ్రగ్స్ పట్టివేత

జయభేరి, రంగారెడ్డి :

రాజేంద్రనగర్ లో 20 లక్షల విలువ చేసే 150 గ్రాముల ఎండీఎంఎ డ్రగ్ ను పోలీసులు సీజ్ చేసారు. హైదరాబాద్ నార్కోటిక్ ఎన్ఫోర్స్‌మెంట్ వింగ్ రాజేంద్రనగర్ పోలీసుల జాయింట్ ఆపరేషన్ లో డ్రగ్స్ గుట్టు రట్టు అయింది. ఒమన్, పాలస్తీనా కు చెందిన నిందితులను అరెస్ట్ చేసారు. బెంగళూర్ నుండి హైదరాబాద్ కు డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. సాఫ్ట్వేర్ ఇంజనీర్, బడా బాబులు టార్గెట్ గా డ్రగ్స్ సప్లయ్ చేస్తున్నారు. పోలీసుల జాయింట్ ఆపరేషన్ లో విదేశీయులు అరెస్ట్ అయ్యారు. బెంగళూర్ అడ్డాగా డ్రగ్స్ దందా నడుస్తోంది.

# వైభవంగా అలివేలు మంగతాయారు రథోత్సవం

- దేవ గుండు వరకు ఊరేగింపు
- వేలాదిగా తరలి వచ్చిన భక్తులు

జయభేరి, దేవరకద్ర :



మహబూబ్ నగర్ జిల్లాలోని ప్రధాన దేవాలయమైన మన్యంకొండ శ్రీ అలివేలు మంగతాయారు రథోత్సవం బుధవారం తెల్లవారుజామున అంగరంగ వైభవంగా జరిగింది. ప్రతి ఏడాది అమ్మవారి రథోత్సవాన్ని సాంప్రదాయ రీతిలో భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ ఎడాది కూడా అమ్మవారి రథోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. అమ్మవారి బ్రహ్మోత్సవాలు ఈనెల 1న ప్రారంభ మయ్యాయి. అందులో భాగంగానే ఉత్సవాలలోని ప్రధాన ఘట్టమైన ఈ రథోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అలివేలు మంగతాయారు అమ్మ వారిని వెంకటేశ్వర స్వామి సమేత గర్భగుడి నుండి గరుడ వాహనంపై దేవస్థానం ముందున్న మైదానానికి ఊరేగింపుగా తీసుకు వచ్చారు. పురోహితుల వేదమంత్రాలు, సన్నాయి వాయిద్యాలు, కాగడాల వెలుతురు, భక్తుల హరి



నామశ్చరణల మధ్య ఈ ఊరేగింపు ముందుకు కదిలింది. ముందుగా రథం ముందు సాంప్రదాయ రీతిలో కుంభం పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శోభాయమానంగా అలంకరించిన రథంపై శ్రీ వెంకటేశ్వర స్వామి సమేత అలివేలు మంగతాయారు అమ్మవారిని దేవస్థానం సమీపంలోని దేవ గుండు వరకు రథోత్సవాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులు అమ్మవారి రథాన్ని లాగి తరించారు. అమ్మవారి రథాన్ని లాగడానికి పోటీపడ్డారు. రథోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. రథోత్సవం అనంతరం అమ్మవారిని మళ్లీ గుడిలోకి తీసుకెళ్లి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వర స్వామి సమేత అలివేలు మంగ తాయారు అమ్మవారు రకరకాల పూలు, వివిధ బంగారు ఆభరణాల మధ్య ఊరేగుతూ భక్త కోటికి దర్శనమిచ్చారు. దీంతో అమ్మవారిని చూసి భక్తులు భక్తి పారవశ్యంతో పులకించిపోయారు. వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్, వంశపారంపర్య ధర్మకర్త అళహరి మధుసూదన్ కుమార్, అళహరి రామకృష్ణ, ప్రధాన పూజలు రాజేష్, నరసింహయ్య, పర్యవేక్షకుడు నిత్యానంద చారి లతోపాటు దేవస్థానం పురోహితులు, సిబ్బంది పాలకమండలి సభ్యులు, వివిధ ప్రాంతాల నుండి తరలి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.



## అండర్ పాస్ రోడ్డు వేయకుంటే ఆందోళన

- సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కమిటీ సభ్యుడు సాంబశివుడు

జయభేరి, దేవరకద్ర :

దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలోని పాత బస్టాండ్ సమీపంలోని రైల్వే గేట్ వద్ద అండర్ పాస్ రోడ్డు నిర్మాణం వేయకుంటే పట్టణ ప్రజలతో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కమిటీ సభ్యుడు సాంబశివుడు అన్నారు. గత ఎన్నికల ముందు ఈ రైల్వే గేట్ వద్ద అండర్ పాస్ రోడ్డు నిర్మాణం చేస్తామని ప్రస్తుత ఎంపీ, ఎమ్మెల్యే గత మూడు నెలల క్రితం ప్రకటించడం జరిగిందన్నారు. కానీ ఇంతవరకు దానికి సంబంధించిన టెండర్ కూడా కాల్ ఫర్ చేయలేదని ఆయన విమర్శించారు. దీంతో పట్టణ ప్రజలు ప్రతిరోజు రాకపోకల విషయంలో చాలా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అయినా ఎవరు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ఈ విషయంలో పాలకులు ఇచ్చిన హామీలను విస్మరించారని ఆయన ఆరోపించారు. రైల్వే గేట్ వద్ద త్వరగా అండర్ పాస్ రోడ్డు వెయ్యాలన్నారు. దేవరకద్ర రైల్వే గేట్ వద్ద అండర్ పాస్ రోడ్డు వేయకుంటే త్వరలో ఆందోళన చేయడానికి ప్రణాళిక సిద్ధం చేస్తామని సాంబశివుడు అన్నారు.

## హోలీ శుభాకాంక్షలు

- నియోజకవర్గం జాగృతి అధ్యక్షులు




జయభేరి, దేవరకొండ :

దేవరకొండ నియోజకవర్గం తెలంగాణ జాగృతి అధ్యక్షులు లకు మారపు మల్లయ్య హైదరాబాదు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు కలిసి హోలీ శుభాకాంక్షలు తెలియజేసినారు. లకుమారుడు మల్లయ్య మాట్లాడుతూ మా అక్క లిక్కర్ కేసులో కడిగిన ముత్యం వలే వచ్చినందుకు మాకు చాలా ఆనందంగా ఉన్నది అని ఆనందం వ్యక్తపరిచినారు.

# విద్యార్థినిలకు అత్యవసర పరిస్థితిల్లో ఆత్మరక్షణపై అవగహన కార్యక్రమం

- కార్యక్రమంలో పాల్గొన్న పరవాడ పోలీస్ శాఖ సిబ్బంది

జయభేరి, పరవాడ:



అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం పరవాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు పాఠశాలల్లో విద్యార్థినుల కోసం సెల్ఫ్ డిఫెన్స్ అవగాహన మరియు శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమం పరవాడ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆర్. మల్లికార్జునరావు సూచనల మేరకు పరవాడలోని సుమిదా స్కూల్ , జాజులవానిపాలెంలోని శ్రీ సాయి విద్యానికెతన్ ,ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలల్లో మహిళా ఎస్ఐ జి.ఎస్.వి. మహాలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులకు అత్యవసర పరిస్థితుల్లో దాడులను ఎలా ఎదుర్కోవాలి, ప్రమాదకర పరిస్థితుల నుంచి ఎలా తప్పించుకోవాలి, తమను తాము ఎలా రక్షించుకోవాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణలో భాగంగా కరాటే మాస్టారు ప్రసాద్ విద్యార్థినులకు ఆత్మరక్షణకు సంబంధించిన పలు పద్ధతులను ప్రాక్టికల్ డెమోన్స్ ద్వారా వివరించి నేర్పించారు. సుమెదా స్కూల్ పి.ఈ.టి మౌనిక విద్యార్థినులకు శారీరక దృఢత్వం, ఆత్మవిశ్వాసం మరియు సెల్ఫ్ డిఫెన్స్‌లో అవసరమైన మెళకువలపై ప్రత్యేకంగా శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది విద్యార్థినులు పాల్గొని ఆత్మరక్షణ పద్ధతులపై అవగాహన పొందారు. మహిళల భద్రత, ధైర్యం మరియు ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని పాఠశాల నిర్వాహకులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని, నేర్చుకున్న సెల్ఫ్ డిఫెన్స్ పద్ధతులను అవసరమైన సందర్భాల్లో ఉపయోగించుకుంటామని తెలిపారు. మహిళల భద్రతపై అవగాహన కల్పించేందుకు పరవాడ పోలీస్ తరఫున ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని తెలిపారు.

# శ్రీశ్రీశ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

- ఘనంగా ప్రారంభమైన అభిషేకాలు, సత్యనారాయణ స్వామి వ్రతాలు

జయభేరి, చింతపల్లి :



శ్రీ శ్రీ శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా అభిషేకాలు ఘనంగా ప్రారంభమైనయని తీదేడు గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం స్వామి వారికి అభిషేకం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నో సమస్యలు తో బాధ పడుతూ ఏది కలిసిరాక ఇబ్బందులు పడుతూ ఏ పాపము చేసాము అని బాధ పడుతుంటారు చాలా మంది ఒక వేళ నిజంగా ఏదైనా పాప కర్మ ఉండచ్చు లేకపోవచ్చు ఒక వేళ ఉంటే ఎటువంటి పాప కర్మ నుండి అయినా విముక్తి కలిగించేది శివుని అభిషేకమని ఆమె అన్నారు. శివుడు ఐశ్వర్య కారకుడు ఎన్నో ఆటంకాలు తొలగించి సంతోషాన్ని ఆరోగ్యాన్ని ప్రసాదిస్తాడని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సత్యనారాయణ వ్రతాలు, గండదీపాలు , మొక్కులు చెల్లించుకుంటరని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్లు ఉలుపాల శేఖర్ రెడ్డి, ధరణిపతి రమణారావు, మాజీ పి.ఏ.సి.యస్ డైరెక్టర్ తిరుమణి పాపయ్య, ఆలయ పురోహితులు సురభి ప్రభాకర్ శర్మ, గ్రామస్తులు సిమర్ల శ్రీను యాదవ్, మర్రు పవన్ కుమార్, రెడ్డి పరమేష్ ముదిరాజ్, ఉడుత శంకరయ్య, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మియాపూర్‌లో డ్రగ్స్ కలకలం!

జయభేరి, హైదరాబాద్ :



మియాపూర్‌లో మరోసారి డ్రగ్స్ కలకలం రేపింది డ్రగ్స్ విక్రయిస్తున్న ముగ్గురు సాఫ్ట్‌వేర్ యువకులను మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుని డ్రగ్స్ విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. పక్కా సమాచారంతో దాడులు నిర్వహించగా, ముగ్గురు సాఫ్ట్‌వేర్ యువకులను పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో డ్రగ్ పెడ్లర్ హనుమంతుతో పాటు డ్రగ్స్ వినియోగిస్తున్న మహేష్, ఆదర్శ్‌లను అదుపులోకి తీసుకున్నారు.

వారి నుంచి సుమారు 12.6 గ్రాముల ఎమ్‌డీఎమ్‌ఏ డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ డ్రగ్ మార్కెట్ విలువ దాదాపు 1.5 లక్షల రూపాయలుగా అంచనా.. దర్యాప్తులో ఈ ముఠా నైజీరియన్‌ల నుంచి డ్రగ్స్ కొనుగోలు చేసి, బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు తరలించి సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు విక్రయిస్తున్నట్లు తేలింది కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# ప్రభుత్వ భూమిని ఆక్రమించిన రెవెన్యూ అధికారులపై చర్యలేవి

- కన్యకా పరమేశ్వరి ఆలయానికి సంబంధించిన ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై చర్యలేవి.
- 2021 లో కలెక్టర్ ఆదర్ ఉన్నా ఈ పేదలకు ఇప్పటివరకు ఎందుకు ఇల్లు మంజూరు చేయలేదు
- త్యాగం నిరతి లేని వారు ఉద్యమకారులు ఎలా అవుతారు





**జయభేరి, చర్ల, మార్చి 4 :**

చర్ల మండలంలోని సాయిబాబా టెంపుల్ పరిసర ప్రాంతాల్లో 117 సర్వే నెంబర్లు చిట్టి మల్ల సుజాత అను ఆమె వికలాంగుడైన తన కుమారుడికి వికలాంగురాలైన తన కోడలికి నివాసం ఏర్పాటు చేయడానికి ఇల్లు కట్టుకోవడానికి కొంత స్థలాన్ని బాగు చేసుకుంది చుట్టూ ఫెన్సింగ్ వేసింది నాలుగు స్తంభాలు నిలబెట్టి రేకులు వేస్తుంది ఈ విషయంపై కొందరు రెవెన్యూ అధికారులకు కంప్లైంట్ చేయగా ఎమ్మార్వో ఆదేశాల మేరకు పదిమంది అధికారులు ఆ స్థలం వద్దకు వచ్చి పుట్టావుటిన ఆ వికలాంగులు నిర్మించుకున్నటువంటి రేకుల షెడ్డు ని చుట్టూ ఉన్న టువంటి ఫెన్సింగ్ ని స్తంభాలని పీకేశారు ఈ సందర్భంగా అక్కడ కొంతమంది గ్రామస్తులతో గొడవ జరిగింది చిట్టిమల సుజాత రు తెలిపిన వివరాల ప్రకారం 2021 లో ఇంటి స్థలం కోసం కలెక్టర్ కి దరఖాస్తు చేయగా నాడున్న కలెక్టర్ ఈమెకు డబల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయించమని ఒక ఆర్డర్ పాస్ చేశారు అప్పుడే ఆ ఆర్డర్ ని తీసుకొని రెవెన్యూ అధికారులకు కలవగా వారే ఇల్లులు కేటాయించడానికి ఇప్పుడు అవకాశం లేదని ఐదు సెంట్ల ఇంటి స్థలం చూపిస్తాము అక్కడ ఇల్లు కట్టుకోమని చెప్పి ఒక స్థలం చూపించారు ఆ స్థలం వేరే వాళ్లకు సంబంధించినది కావడం వల్ల వాళ్లు వచ్చి సుజాత పై గొడవ పడగా గొడవలు పెట్టుకునే పరిస్థితిలో తాను లేకపోవడం వల్ల ఆ ప్రయత్నాన్ని అంతటితో ఆపి చేసింది అయినప్పటికీ ఆ ఆర్డర్ కాపీ పట్టుకొని నాకు ఇల్లు ఇప్పించండి అని నాటి నుంచి నేటి వరకు ఆఫీసుల చుట్టూ తిరిగిన ప్రయోజనం లేకపోయింది అందుకనే పోయిన ఫిబ్రవరి నెలలో చర్ల మండలంలోని స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తాసిల్దార్ సూచన మేరకు డిప్యూటీ తాసిల్దారుని కలిసి పరిస్థితి వివరించడం జరిగింది డిప్యూటీ తాసిల్దారు డిస్టబెన్స్ లేకుండా ఉన్న కొంత భూమి చూసుకొని ఇల్లు నిర్మించుకోండని తెలిపారు అందులో భాగంగానే సుజాత తన కొడుకు కోడలైన వికలాంగులను తీసుకొని సాయిబాబా గుట్ట సమీపంలో ఇల్లు నిర్మించుకునే ప్రయత్నం చేయగా ఉద్యమకారులమని చెప్పుకుంటూ కొందరు ఆ భూమి మా ఉద్యమకారులకు కేటాయించిన భూమి అంటూ ఆ భూమిలోకి నువ్వు ఎట్లా వస్తావు అంటూ సుజాత పై గొడవపడ్డారు అనంతరం తాసిల్దార్ కి ఆ భూమి ఆక్రమణకు గురవుతుందని ఫిర్యాదు చేశారు అనంతరం రెవిన్యూ అధికారులు పదిమంది వచ్చి అక్కడ సుజాత తన కొడుకు కోడలు కోసం నిర్మిస్తున్న టువంటి ఇంటిని పీకి వేసే ప్రయత్నం చేశారు అదలా ఉండగా ఎటువంటి సంబంధంలేని కొంతమంది అట్టి స్థలం వద్దకు వచ్చి మా స్థలంలోని ఇల్లు వేస్తావా అని అంటూ సుజాత అని వికలాంగులైన సుజాత కోడలను కొడుకుని అసభ్యమైన పదజాలంతో తిట్టారు అవమానించారు అంతటితో ఆగకుండా మాట మాట పెరిగి గొడవ పెద్దది కావడంతో వచ్చిన వారు సుజాత పై తన కొడుకు కోడలపై దాడి చేశారు కోడల్ని నెట్టివేసి సుజాతని కింద పడి వేసి కొట్టారు ఇట్టి ఘటనపై సుజాత కోడలు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు చర్ల తాసిల్దార్ తన సొంత రెవెన్యూ అధికారులే ప్రభుత్వ భూములను ఆక్రమించి భవనాలు నిర్మిస్తున్న సందర్భంలో స్థానిక ప్రజలు పార్టీలు ఎన్ని వినతి పత్రాలు ఇచ్చిన ఎన్ని ఆందోళన పోరాటాలు చేసిన ఆక్రమించిన వారిపై ఇసుమంత చర్యలు తీసుకున్న పాపాన పోలేదు కానీ వికలాంగులపై తన వీర ప్రతాపం చూపించారు ప్రభుత్వ భూములను రెవిన్యూ వారి తప్ప మిగిలిన పేదవారు ఉపయోగించుకోకూడదన్నటువంటి వైఖరిని తహసిల్దార్ ప్రదర్శించడం సరైనది కాదు కన్యకా పరమేశ్వరి ఆలయానికి సంబంధించిన ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు పేదవాళ్లకు ఒక న్యాయం రెవెన్యూ అధికారులకు ఒక న్యాయం డబ్బులు ఉన్న వాళ్ళకి ఒక న్యాయం అన్నట్లుగా వ్యవహరించడం సరైనది కాదు సుజాత తన వికలాంగ కొడుకు కోడలికి నిర్మిస్తున్న ఇంటిని ఏ విధంగా అయితే తొలగించడానికి మందలు మందలుగా ప్రభుత్వ రెవెన్యూ అధికారులు వచ్చారో అదేవిధంగా చర్ల మండలంలో ఆక్రమణకి గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలి ఆ భూముల్లో నిర్మించినటువంటి కట్టడాలను కూల్చివేయాలి లేనియెడల చర్ల రెవెన్యూ అధికారుల వ్యవహారం పట్ల ప్రజల్లో పలు అనుమానాలు రేకెత్తే అవకాశం ఉంది ప్రజల్లో రెవెన్యూ అధికారులు అభాసు పాలవుతారు త్యాగం చేయనటువంటి వారు ఉద్యమకారులు ఎలా అవుతారు సాటి మనిషిని ప్రేమించలేని వారు సమాజ సేవకులు ఎలా అవుతారు ఉద్యమకారులమంటూ పేద ప్రజలపై రాజకీయ పార్టీలను అడ్డం పెట్టుకొని దాడులు దౌర్జన్యాలు చేయడం సరైనది కాదు తెలంగాణ ఉద్యమం ఇళ్ల స్థలాల కోసం జరిగింది కాదు స్వార్థ ప్రయోజనాల కోసం తెలంగాణ ఉద్యమాన్ని అడ్డం పెట్టుకొని ప్రజల పట్ల అజమాయిషీ చేయడం పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు తక్షణమే అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి కలెక్టర్ నోటీసుని దృష్టిలో ఉంచుకొని చిట్టిమల్ల సుజాత కుటుంబానికి డబల్ బెడ్ రూమ్ ఇల్లు లేదా ఐదు సెంట్ల ఇంటి స్థలం ఇచ్చి ఆమెని ఆదుకొని న్యాయం చేయాలని ప్రజలు ఆశిస్తున్నారు



## ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

**జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 03 :**

తుర్కపల్లి మండలం వెంకటాపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వపరిపాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులై ఒక్కరోజు విధులను నిర్వర్తించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కర్రె మాధవి కరుణాకర్ గౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సౌజన్య, పంచాయతీ కార్యదర్శి దార మహేందర్, వార్డు సభ్యులు నారా నాగరాజు, కొడపాక మహేష్, పల్లెపాటి అనిల్ కుమార్, ఉపాధ్యాయులు రజిత, విద్యార్థులు పాల్గొన్నారు.

## పోచమ్మ గుడిలో అభిషేకాలు నిర్వహించిన సర్పంచ్



**జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 03 :**

తుర్కపల్లి మండలం ఇంద్రనగర్ గ్రామంలో శుక్రవారం గ్రామ సర్పంచ్ రాగుల లక్ష్మి రామచంద్రయ్య ఆధ్వర్యంలో వార్డు సభ్యులు పోచమ్మ తల్లి దేవాలయంలో అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు గుర్రాల ప్రశాంత, మోర శ్రీను, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కోటి సత్యనారాయణ, కనకయ్య, గుర్రాల కనకయ్య, గుర్రాల ఐలయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

## హోలీల హే.. రంగ హోలీ..



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం కేంద్రంలో బుధవారం హోలీ పండుగ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ప్రతి ఏడాది హోలీ పండుగ వేడుకలను సాంప్రదాయ రీతిలో ఘనంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా హోలీ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.

## రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలి

- బిఆర్ఎస్ పార్టీ కన్వీనర్, దొడ్డి తాతారావు



**జయభేరి, చర్ల, మార్చి 4 :**

చర్ల,మండలానికి చెందిన రిటైర్డ్ ప్రభుత్వఉద్యోగులు తమకు రావలసిన పెన్షన్ గ్రాట్యుటీ కమ్యూటేషన్ ఇతర ఆర్థిక ప్రయోజనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మండల కార్యాలయంలో తహసీల్దార్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఉద్యోగి బీఆర్ఎస్ పార్టీ చర్ల మండల కన్వీనర్ దొడ్డి తాతారావు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ అనంతరం నెలలు గడిచినా బకాయిలు చెల్లించక పోవడంతో కుటుంబ పోషణలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు.వెంటనే సంబంధిత అధికారులతో సమన్వయం చేసి పెండింగ్లో ఉన్న బిల్లులను విడుదల చేయాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు రిటైర్డ్ ఉద్యోగులు మాట్లాడుతూ జీవితాంతం ప్రభుత్వ సేవా లో పనిచేసిన తమకు కనీస గౌరవం చూపాలని ఆలస్యం లేకుండా ప్రయోజనాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. తహసీల్దార్ స్పందిస్తూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు రిటైర్డ్ ఉద్యోగులు పెన్షనర్ల సంఘం అధ్యక్షులు సర్వేశ్వరరావు,నాగభూషణం,అజీజ్,కాకి అనిల్, పంజా రాజు,గోరింట్ల వెంకటేశ్వరావు, బొజ్జ సాయిప్రణీత్,గాధం శెట్టి కిషోర్ కుమార్,పాసిగంటి సంతోష్,వంశీ, ముత్యాలరావు,నాగేశ్వరావు, కుప్పల నరసింహారావు, అంకాల శ్రీనివాసరావు, బేతం చర్ల నర్సవేణి,భానుమతి తదితరులు పాల్గొన్నారు .




# రమనీయం.. కమనీయం.. శ్రీనివాసుని కళ్యాణం



**జయభేరి, వెంకటాపురం, మార్చి 4 :**

వెంకటాపురం మండల కేంద్రంలో వేంచేసి ఉన్న శ్రీ పద్మావతి, అలివేలు మంగ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి తిరు కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీవారి కళ్యాణానికి ఆలయ అనువంశిక ధర్మకర్త పట్టు వస్త్రాలు సమర్పించారు. బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు మొదలైన కళ్యాణ తంతు మంగళ వాయిద్యాలు, వేదమంత్రాల నడుమ బ్రాహ్మణ పండితులు జిలకర బెల్లం పెట్టి మాంగల్య ధారణ గావించారు. గోవింద నామస్మరణతో భక్తుల జయ జయ ద్వానాల మధ్య శ్రీనివాసుని కళ్యాణ వేడుక కన్నుల పండుగగా జరిగింది. భక్తులు కళ్యాణ మహోత్సవాన్ని కనులారా వీక్షించి ఆనంద పరవశులయ్యారు.అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వైకుంఠ వాసుని కళ్యాణాన్ని తిలకించడానికి వాజేడు, ఏటూరు నాగారం, మంగపేట, కన్నయ్య గూడెం, చర్ల మండలాలతో పాటు చతిస్గడ్ రాష్ట్రం నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడంతో మండల కేంద్రంలోని పురవీధులన్నీ భక్తులతో కిటకిటలాడాయి.భక్తి భావం వెల్లివిరిసింది. దేవాదాయ శాఖ, ఆలయ కమిటీ నిర్వహకులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్ళు వేశారు. బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసంతార్పణ చేశారు. కొంతమంది భక్తులు వాటర్ బాటిళ్లు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ జాతరలో సంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించనున్నాయి.






## ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే జిఎంఆర్

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ప్రజలకు బుధవారం దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) హోళీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ హోలీ అందరి జీవితాల్లో సంబరాలు నింపాలని, హోళీ రంగుల శోభ కొత్త ఉత్సాహాన్ని తీసుకురావాలని ఆశిస్తున్నానన్నారు. ఈ సందర్భంగా దేవరకద్ర నియోజకవర్గ ప్రజలందరికీ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు ఎమ్మెల్యే జిఎంఆర్ అన్నారు.

## ఎంఎన్జే క్యాన్సర్ ఆసుపత్రిలో వైద్యుల ఆందోళన


- ఐదవ రోజు కొనసాగుతున్న ఎం.ఎన్.జే క్యాన్సర్ ఆస్పత్రి డాక్టర్ల నిరసన

**జయభేరి, హైదరాబాద్ :**

ఆర్హత లేని నూతన డైరెక్టర్ ను నియమించడం పై ఎంఎంజె హెచ్ఒడిస్ ,సిబ్బంది ఆందోళన ఐదవ రోజు కొనసాగింది. మెహదీ నవాజ్ జంగ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ & రీజినల్ క్యాన్సర్ సెంటర్ (ఎంఎనో), హైదరాబాద్లో డైరెక్టర్ నియామకంపై వైద్యులు, సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూతనంగా బాధ్యతలు తీసుకున్న సదానందం గౌడా డైరెక్టర్ కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ .ఛాంబర్ ముందు ఆందోళనకు దిగారు. నిమ్స్ ఆసుపత్రికి చెందిన జూనియర్ సదానంద గౌడ, ఎంఎంజె క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ నియామకంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసారు. ఎంఎంజె ఆసుపత్రిలో దశాబ్దాలుగా సేవలందిస్తున్న సీనియర్ ప్రొఫెసర్లు ఉండగా, వారి సీనియారిటి అనుభవాన్ని పక్కనబెట్టి బయటి సంస్థకు చెందిన వ్యక్తిని నియమించడం పై అందోళనకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంస్థ పరిపాలన, వైద్య సేవలు,విద్యా పరిశోధన కార్యక్రమాలపై సంపూర్ణ అవగాహన కలిగిన సీనియర్లను విస్మరించడం సిబ్బంది మనోభావాలను దెబ్బతీసే చర్యగా వైద్యులు భావిస్తున్నారు. సీనియారిటీ, సంస్థ సంప్రదాయాలను గౌరవించకుండా తీసుకున్న ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే పునఃపరిశీలించాలని డిమాండ్ చేసారు. ఎంఎంజె పరిపాలనా, రోగులకు నిరంతర నాణ్యమైన వైద్య సేవల కోసం అంతర్గత అర్హులైన సీనియర్ అధ్యాపకులకు ప్రాధాన్యం ఇవ్వాలంని సిబ్బంది అంటున్నారు.

# పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

**జయభేరి, మేడ్చల్ :**




దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో కేసులో మేడ్చల్ ప్రత్యేక పోక్సో కోర్టు కఠిన తీర్పు వెలువరించింది. నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ రూ.5,000 జరిమానా విధించింది. బాధితురాలికి రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించింది. ప్రభుత్వ తరపున న్యాయవాది ప్రభాకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, 2021లో నిందితుడు మైనర్ బాలికను బెదిరింపులకు గురిచేసి ముంబైకు తీసుకెళ్లి లైంగిక దుర్వినియోగానికి పాల్పడినట్లు కేసు నమోదైంది. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. నిందితుడు షేక్ నజీర్ అలియాస్ అమిత్. ప్రస్తుతం దుండిగల్ మండలం చర్చి గాగిల్లాపూర్లో నివాసం ఉంటున్నాడు. స్వగ్రామం వికారాబాద్ జిల్లా యలాల్ మండలం విశ్వనాథ్పూర్ గ్రామమని ప్రభాకర్ రెడ్డి తెలిపారు. విచారణలో సమర్పించిన సాక్ష్యాధారాలను పరిశీలించిన కోర్టు నిందితుడిని దోషిగా నిర్ధారించింది. ఈ కేసులో నిందితుడిపై బాధితురాలి తండ్రి హత్యకు సంబంధించిన మరో కేసు పెండింగ్లో ఉన్నట్లు ప్రభాకర్ రెడ్డి చెప్పారు.



## జూమ్ చేసి మరీ మా శరీరాలను ఫోటోస్ తీయొద్దు..

ఇలా కదా ప్రొఫెషనల్ ఫోటోగ్రాఫర్స్ ఫ్రేమింగ్ పెట్టి ఫోటోలు తీసేంది. మరి మీరేం చేస్తున్నారు..? వల్గర్ ఫ్రేమింగ్‌తో ఇరిటేట్ చేస్తున్నారు..! డ్రెస్ సర్దుకుంటుంటే ఫోటోలు కొడతారు... నడుచుకుంటూ వెళ్తున్నా పెట్టకూడని ఫ్రేమ్‌లు పెట్టి అభ్యంతరకంగా తీస్తారు... ఇంకొంత మంది మంచి ఫోటోను సైతం మార్ఫింగ్ చేసి అసహ్యంగా సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్నారని యంగ్ హీరోయిన్లు వాయిస్ రేజ్ చేయడం ఇప్పుడు ఇండస్ట్రీలో రీసౌండ్ చేస్తోంది. నాసామిరంగ నటి అశికా రంగనాథ్ ఈ వల్గర్ క్లిక్స్‌పై గళం విప్పారు. ఇండస్ట్రీని సరికొత్త సమస్య తిప్పలు పెడుతోంది.. ఉద్యమించాల్సిన టైమ్ వచ్చింది డియర్స్ అంటూ వార్ సైరన్ మోగించారు. ఫ్రేమింగ్ ఎలా ఉండాలో నేర్పిద్దాం... పబ్లిక్ మీటింగ్స్‌లో మహిళా నటులను ఎలా గౌరవించాలో చూపిద్దాం... జూమ్ ఇన్ జూమ్ అవుట్ ఎక్కడ వాడాలో ఎప్పుడు వాడాలో కాస్త ఘాటుగానే ట్రైనింగ్ ఇద్దాం... రండి కదిలి రండి సరికొత్త సమస్యను అంతమొందిద్దామంటూ సోషల్ మీడియా వేదికగా ఇండస్ట్రీలోని మహిళా నటులందరికి వార్ ఇన్విటేషన్ ఇచ్చారు. అశికా రంగనాథ్ కూడా ఇదే టోన్ వినిపించారు. వల్గర్ యాంగిల్స్ పెట్టే ఫోటోగ్రాఫర్లను తోలు వలచాల్సిందేనంటున్నారు. ఈవెంట్లను కవర్ చేసే ఫోటోగ్రాఫర్లు ప్రొఫెషనల్‌గా, మర్యాదగా వ్యవహరించాలి బాసు అంటున్నారు. ఒకటి రెండు సార్లు కాదు... పదేపదే ఇదే జరుగుతోంది.. ఇదేం దరిద్రం అంటూ అసహనం వ్యక్తం చేశారు. మమల్నీ గౌరవించండి, కానీ కించపరచకండి అంటూ పోస్టులు పెట్టారు. మొత్తంగా... ఫోటోపైత్యంపై హీరోయిన్లు గొంతెత్తడంతో సినీ ఇండస్ట్రీలో మరో కొత్త వివాదం తెరపైకి వచ్చినట్టు కనిపిస్తోంది. కన్నడ హీరోయిన్స్ అయిన ఈ ముగ్గురి పోస్టులపై ఇప్పటికే సోషల్ మీడియాలో డిబేట్లు మొదలయ్యాయి. ఈవెంట్స్‌లో ఫోటోగ్రాఫర్ల హద్దులపై నిబంధనలు పెట్టాలన్న వాయిస్ కూడా వినిపిస్తోంది. మరీ టాపిక్ ఎంతవరకు వెళ్తుంది..? ఏం జరగబోతోంది..? అన్నది చూడాలి.



## వెంకటేష్ నో చెప్పాడు.. బాలయ్య చేసేశాడు..!

సీనియర్ హీరోలు కూడా కుర్ర హీరోలతో పోటీ పడుతూ సినిమాలు చేసి మెప్పిస్తున్నారు. బాలకృష్ణ, వెంకటేష్, చిరంజీవి, నాగార్జున వరుస సినిమాలతో దూసుకుపోతున్నారు. వెంకటేష్ లాస్ట్ ఇయర్ సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో భారీ హిట్ అందుకున్నారు. ఈ సినిమా ఏకంగా రూ. 300కోట్లకు పైగా వసూల్ చేసింది. అలాగే ఈ ఏడాది చిరంజీవి నటించిన మన శంకర వరప్రసాద్ సినిమాలో గెస్ట్ రోల్ లో నటించారు. ఈ సినిమా కూడా భారీ హిట్ అయ్యింది. ప్రస్తుతం త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో ఓ సినిమాతో పాటు అనిల్ రావిపూడితో మల్టీస్టారర్ మూవీ చేస్తున్నారు. అయితే వెంకటేష్ ఓ బ్లాక్ బస్టర్ సినిమాకు నో చెప్పాడట.. అదే సినిమా బాలకృష్ణ చేసి బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నారు. ఆ సినిమా ఇండస్ట్రీని షేక్ చేసింది. వెంకటేష్ నో చెప్పిన కథతో బాలకృష్ణ సినిమా చేసి బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నారు. నందమూరి అభిమానులకు ఆ సినిమా పూనకాలు తెప్పించింది. ఇంతకూ ఆ సినిమా ఏదో తెలుసా.? ఆ సినిమా మరేదో కాదు సమరసింహారెడ్డి. బీగోపాల్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఎంత పెద్ద విజయం సాధించిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. 1999 సంక్రాంతి కానుకగా విడుదలైన సమరసింహారెడ్డి సినిమా ఇండస్ట్రీ హిట్ గా నిలిచింది. ఫ్యాక్షన్ కథతో తెరకెక్కిన ఈ సినిమా ఆడియన్స్ కు పూనకాలు తెప్పించింది. అంజలా జవేరి, సంఘవి, సిమ్రాన్ హీరోయిన్లుగా నటించిన ఈ సినిమా ఇండస్ట్రీని షేక్ చేసింది. అయితే దర్శకుడు బి. గోపాల్ మొదట ఈ సినిమా కథను వెంకటేష్ కు వినిపించారట. అయితే అప్పటికి వెంకటేష్ ఫ్యామిలీ కంటెంట్ సినిమాలు, లవ్ స్టోరీస్‌తో చేస్తుండటంతో ఫ్యాక్షన్ కథలకు అప్పుడే సిద్ధంగా లేను అని చెప్పారట. అయితే ఫ్యాక్షన్ కథలు, మాస్ యాక్షన్ సిన్ సినిమాలకు బాలకృష్ణ న్యాయం చేస్తారు అని చెప్పి వెంకటేష్ బాలయ్య పేరును సూచించారట. దాంతో బి గోపాల్ బాలకృష్ణకు కథను వినిపించగానే బాలయ్య ఒకే చెప్పారట. అలా వెంకీ నో చెప్పిన కథను బాలయ్య చేసి ఇండస్ట్రీ హిట్ అందుకున్నారు.

## అలా రాసినప్పుడే పాటకు సార్థకత!



'పెద్ది' చిత్రంలో ఇటీవల విడుదలైన 'రై రై రారా' పాటకు మంచి స్పందన లభిస్తున్నది. ఏ.ఆర్.రెహమాన్ స్వరపరచిన ఈ గీతాన్ని అనంత శ్రీరామ్ రచించారు. రామ్‌చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా ఏప్రిల్ 30న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా బుధవారం గీత రచయిత అనంత శ్రీరామ్ విలేకరులతో ముచ్చటించారు. ఈ పాట తాలూకు చర్చల్లో ప్రబోధాత్మకంగా ఉండాలని నిర్ణయించుకున్నాం. లోతైన భావాల్ని చెబుతూనే వ్యవహారిక భాషలో పాట ఉండాలని దర్శకుడు బుచ్చిబాబు సానా సూచించారు. అందుకు తగినట్లుగానే మిత్ర సంహిత అనే ప్రక్రియలో పాట రాశాను. ఈ పాట వింటున్నప్పుడు స్నేహితులిద్దరూ కలిసి మాట్లాడుతున్నట్లుగా ఉంటుంది. నా దృష్టిలో సినిమా పల్లకిని పాట మోయాలి. అప్పుడే పాటకు ప్రయోజనం. అందుకే ఈ పాటను శ్రీశ్రీ గేయ కవితలా రాశాను. శ్రీశ్రీ కవితలు చదువుతున్నప్పుడు ఎలాంటి ఉద్వేగం ఉంటుందో అలాంటి ప్రాసలతో ఈ పాట రాశాను. మాస్ పరిభాషలో ఫిలాసఫీ చెప్పడం కత్తిమీద సాములా అనిపించింది. అందుకే ఈ పాట రాయడానికి రెండు నెలలు కసరత్తులు చేశాను. ఒక పాట రాస్తే..ఆత్మహత్య ఆలోచనలు వచ్చిన వారు వాటిని విరమించుకునేలా ప్రేరణ కలిగించాలి. అలాంటి పాట రాసినప్పుడు నా రచన సార్థకమైనట్లు భావిస్తాను. అలాంటి లక్షణాలు ఈ పాటలో ఉన్నాయనుకుంటున్నా. ఈ పాట విన్న రామ్‌చరణ్ నన్ను హత్తుకొని అభినందించారు.

## కన్నుల పండువగా విరోష్ రిసెప్షన్



అగ్ర తారలు విజయ్ దేవరకొండరష్మిక మందన్న వెడ్డింగ్ రిసెప్షన్ బుధవారం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ హోటల్లో ఘనంగా జరిగింది. ఈ వేడుకకు సినీ, రాజకీయ ప్రముఖులు తరలివచ్చారు. దక్షిణాది సంప్రదాయ వస్త్రధారణలో కొత్త దంపతులు మెరిసిపోయారు. గత నెల 26న రాజస్థాన్ ఉదయ్‌పూర్‌లో వివాహం మొదలు రిసెప్షన్ వరకు 'విరోష్' వెడ్డింగ్ దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించింది. వివాహానంతరం కొత్త జంట పలు కార్యక్రమాలతో వార్తల్లో నిలిచారు. ఇటీవలే దేశవ్యాప్తంగా కొన్ని నగరాల్లో మిఠాయిల పంపిణీతో పాటు ఎంపిక చేసిన దేవాలయాల్లో భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాల్ని నిర్వహించారు. సొంత ఊరు తుమ్మన్‌పేట్‌లో విజయ్ దేవరకొండ నూతన గృహ ప్రవేశం చేయడంతో పాటు గ్రామస్తులకు వివాహ విందు ఇచ్చారు. 'విరోష్' వెడ్డింగ్ రిసెప్షన్ తాలూకు ఫోటోలు సోషల్‌మీడియాల్లో ట్రెండింగ్ నిలిచాయి. కన్నుల పండువగా జరిగిన ఈ వేడుకకు సినీ ప్రముఖులు చిరంజీవి, నాగార్జున, వెంకటేష్, కరణ్‌జోహార్, అల్లు అర్జున్, రవితేజ, నాగచైతన్య, రామ్‌చరణ్, నాని, రానా, శ్రీలీల, నమ్రత, శ్రీకాంత్, దిల్‌రాజు, సుకుమార్, కార్తీ, శరత్‌కుమార్ తదితరులు హాజరయ్యారు.

**కొత్త కోడలు వచ్చింది.. మంచిగా చూసుకోండి**

బుధవారం మధ్యాహ్నం విరోష్ జోడీ తెలుగు మీడియాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ మాట్లాడుతూ తన సినీ ప్రయాణంలో మీడియా విడదీయరాని భాగమైందని, వారిని ఎప్పటికీ మర్చిపోనని అన్నారు. రష్మికను చూపిస్తూ 'తెలుగు రాష్ట్రాలకు కొత్త కోడలు వచ్చింది. మంచిగా చూసుకోండి' అనడంతో అక్కడ నవ్వులు విరిశాయి. 'మేమిద్దరం జీవితంలో కొత్త అధ్యాయం మొదలుపెట్టాం. మీ ఆశీస్సులు కోరుతున్నాం' అని రష్మిక మందన్న పేర్కొన్నారు.



## నెట్టింట పిచ్చెక్కిస్తున్న అందాల ముద్దుగుమ్మ..

బుల్లితెరపై తనకంటూ మంచి క్రేజ్ సొంతం చేసుకుంది దీపికా పిల్లి. ఒకప్పుడు టిక్ టాక్ వీడియోస్ చేసి విపరీతమైన ఫాలోయింగ్ సంపాదించుకుంది. ఇక అదే ఫేమ్ తో బుల్లితెరపైకి అడుగుపెట్టింది. పలు షోలలో యాంకరింగ్ చేస్తూ అలరించింది. తక్కువ సమయంలోనే తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ ముద్దుగుమ్మ.. ఇప్పుడు కథానాయికగా మారిన సంగతి తెలిసిందే. జబర్దస్త్, ఢీ షోలలో యాంకర్ గా మెరిసిన దీపికా.. ఆ తర్వాత వాంటెడ్ పండుగాడు సినిమాతో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది. ఈ సినిమాతోపాటు యాంకర్ ప్రదీప్ మాచిరాజుతో కలిసి అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి సినిమాలోనూ నటించింది. అయితే ఈ రెండు చిత్రాలు పెద్దగా ఆడలేదు. అందం, అభినయంతో ప్రేక్షకుల హృదయాల్లో చోటు సంపాదించుకుంది. ఈ అమ్మడు నెట్టింట చాలా యాక్టివ్. అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి సినిమా తర్వాత ఇండస్ట్రీలో దీపికా సైలెంట్ అయ్యింది. అటు బుల్లితెరపై కూడా కనిపించడం లేదు. తాజాగా ఈ అమ్మడు తన ఇన్ స్టాలో షేర్ చేసిన ఫోటోస్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. పింక్ కలర్ లెహంగాలో మరింత అందంగా కనిపిస్తుంది దీపికా. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మకు ఇన్ స్టాలో 2.1 మిలియన్ ఫాలోవర్స్ ఉన్నారంటే ఈ బ్యూటీకి ఏ స్థాయిలో క్రేజ్ ఉందో చెప్పక్కర్లేదు. ప్రస్తుతం ఈ అమ్మడు తెలుగులో సరైన అవకాశాల కోసం వెయిట్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**